





ప్రమాదానికి కారణమైన ఫ్లెక్సీ ఇదే..



మృతుల కుటుంబీకుల రోదన

ఆవిరైన.. ఆనందం

ఫ్లెక్సీ పెడుతుండగా విద్యుదాఘాతం.. నలుగురి మృతి



సంఘటన జరిగిన తాడిపర్రు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం..సముదాయిస్తున్న పోలీసులు

సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం.. రెండు సామాజిక వర్గాల మధ్య పోరాటం.. ఒకరు విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే.. మరొకరు విగ్రహం ఎలాగైనా ఏర్పాటు చేయాలని తలంచారు.. గత 18 నెలలుగా ఎదురుచూపులు.. విగ్రహావిష్కరణ రోజు రానే వచ్చింది.. పట్టలేనంత ఆనందం.. ఆ వేడుక ఎంతో ఘనంగా నిర్వహించాలని తలంచారు.. ఆ ఆనందం వెంటే విషాదం ఉందని ఊహించలేదు.. ఆదివారం ఉదయం అంతా విగ్రహావిష్కరణ కార్యక్రమాల్లోనే కలియతిరిగారు.. తెల్లవారితే విగ్రహావిష్కరణ.. ఒక పక్క భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.. మరో పక్క టెంట్‌లు.. కుర్చీల ఏర్పాట్లలో మరికొందరు ఉన్నారు.. ఎవరి ఏర్పాట్లలో వారుండగానే ఏడుగురు యువకులు 20 అడుగుల భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు.. సోమవారం తెల్లవారుజాము కావడంతో పైన ఏమి ఉందో కనిపించలేదు.. అంతే ఒక్కసారిగా ఫ్లెక్సీని పైకెత్తారు.. అంతే ఆ ఫ్లెక్సీ విద్యుత్ వైర్లకు తగలడంలో ఫ్లెక్సీకి ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేమ్‌కు విద్యుత్ పాస్ అయ్యింది.. నలుగురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు.. మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు.. మరో ఇద్దరు స్వల్పగాయాలపాలయ్యారు. అంతే అప్పటి వరకూ ఎంతో సందడిగా ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా మూగబోయింది.. గ్రామస్తులు విగజీవులుగా పడి ఉన్న నలుగురిని పట్టుకుని సపర్యలు చేస్తూనే ఉన్నారు..ఒరేయ్ లేవండిరా..లేవండిరా అంటూ అంతా చుట్టూచేరి పిలుస్తూనే ఉన్నారు.. అయినా చలనం లేదు.. నలుగురు యువకుల్లో ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి.. పిల్లలు ఉన్నారు.. ఒకరికి మాత్రమే పెళ్లికాలేదు.. కుటుంబీకులు అంతా చేరి మృతదేహాలను పట్టుకుని బోరుమన్నారు.. ఇక మాకు దిక్కెవరంటూ కన్నీటి పర్యంతమయ్యారు.. అప్పటి వరకూ ఎంతో సందడిగా అరుపులు.. కేకలతో ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా రోధనలతో మిన్నంటింది.. ఆనందం కాస్తా ఆవిరైంది.. -7లో

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 125 అర్జీలు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ సమస్యలతో వస్తున్న అర్జీలు ఏ ఒక్కటి పెండింగ్‌లో లేకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు.నిర్లక్ష్యం వహించకుండా అర్జీలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం పీజీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సకాలంలో ప్రజలకు నాణ్యమైన సేవలందించాలన్నారు.జిల్లాలో ప్రజల నుంచి 126 అర్జీలు స్వీకరించినట్లు జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో టి రామచంద్రమూర్తి, సీపీవో అప్పల కొండ , డీఆర్‌డీఏ పీడీ మూర్తి పాల్గొన్నారు.

మస్తర్ల మాయాజాలంపై గ్రామంలో విచారణ


డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు

రాజానగరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'మస్తర్ల మాయాజాలం' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం మండలంలో కలకలం రేకెత్తించింది.ముక్కినాడలో చేపడుతున్న ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు దొంగ మస్తర్లు నమోదు చేయడంపై గ్రామానికి చెందిన కొంత మంది బొమ్మూరులోని కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంతో కూడిన జిరాక్స్‌ను, ఉపాధి పనుల్లో అవకతవలకు సంబంధించిన ఆధారాలను డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావుకు అందజేశారు. దీనిపై పీడీ స్పందించి డ్వామా ఏపీడీని విచారణాధికారిగా నియమించామని, తక్షణమే గ్రామ సభలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 25 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీ కోసం)ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా మాట్లాడి ఫిర్యాదు వివరాలను తెలుసుకున్నారు. ఆయా స్టేషన్ల బాధ్యులతో ఫోన్‌లో మాట్లాడి తగు ఆదేశాలిచ్చారు. సివిల్, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాటలు,దొంగతనాలకు సంబంధించిన 25 ఫిర్యాదులను స్వీకరించారు.

ఓటేద్దాం! మాస్టారు!



టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది.పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు.వాస్తవానికి ఆయన పదవీ కాలం 2027 మార్చి 29వ తేదీ వరకూ ఉంది.కానీ ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈఎన్నిక జరగనుంది.ఈ ఉప ఎన్నికకు ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుంది.18వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు.19న నామినేషన్ల స్క్రూట్నీ చేస్తారు. 21 అభ్యర్థుల విత్‌డ్రాకు చివరి తేదీ. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుంది.9న ఓట్లను లెక్కిస్తారు.12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక అంటే చాలా ప్రతిష్టాత్మకంగా జరుగుతోంది. ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయవర్గాలకు ఓటు హక్కు ఉంటుంది. ఉపాధ్యాయ వర్గాల నుంచే పోటీ చేయవలసి ఉంది. ఎలిమెంటరీ, యూపీ స్కూళ్ల టీచర్లకు ఓటు హక్కు లేదు.ప్రభుత్వ ప్రైవేట్ హైస్కూళ్లు, కాలేజీలు,యూనివర్శిటీలు,ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే అధ్యాపకులందరికీ ఓటు హక్కు ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల ఓటు హక్కుకు అర్హతను హెచ్ఎం, కళాశాలలో ప్రిన్సిపాల్స్ సిఫారసు చేస్తారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో టీచర్ల అర్హతను డీఈవో సిఫారసు చేస్తారు. ఇంజనీరింగ్ కళాశాలలోని టీచర్లకు జేఎన్‌టీయూ సిఫారసు చేస్తుంది.ఈ నెల 6న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. 2021లో జరిగిన ఎన్నికలలో సుమారు 17 వేల మంది ఓటర్లు ఉన్నారు.గత నెల 24న ప్రకటించిన ముసాయిదా జాబితాలో కొత్తగా 13,677 మందికి ఓటు లభించింది. అంటే మొత్తంగా 30 వేల మంది ఓటర్లు ఉండే అవకాశం ఉంది.

- ఈ నెల 11న నోటిఫికేషన్
- వచ్చే నెల 5న పోలింగ్
- 9న ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు

అభ్యర్థులు వీరే..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు అంటే తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి, ఏలూరు,అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ జిల్లాల పరిధిలోని రంపచోడవరం, చింతూరు (ఎటపాక) డివిజన్ల పరిధిలోని టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఇప్పటి వరకూ పీడీఎఫ్ ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థిగా పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మం డలం నారినమెరక పంచాయతీలోని గమళ్లపేటకు చెందిన బొర్రా గోపిమూర్తి పేరు ఖరారైంది. ఎస్‌టీయూ నుంచి లంకలపల్లి శ్రీనివాసరావు పేరు మొదట్లో వినిపించింది.కానీ ప్రస్తుతం మౌనంగా ఉండడం గమనార్హం. గత ఎన్నికల్లో ఎస్‌టీయూ తరఫున పోటీచేసి ఓటమిపాలైన గంధం నారాయణరావు కూడా పోటీకి వస్తారనే ప్రచారం ఉంది. ప్రస్తుతానికి ప్రచారంలో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ముందున్నారు.



మాటల్లేవ్.. చేతలే!

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా..

- పిఠాపురం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- మోడల్ నియోజకవర్గంగా చేస్తా
- సమస్యలు నా దృష్టికి తీసుకురండి
- గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్
- పిఠాపురంలో సుడిగాలి పర్యటన

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'అన్నిరంగాల్లో పిఠాపురాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నాం. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మాటలు కాదు.. చేతల్లో చేసి చూపిస్తున్నా.. ఎన్నికల ముందు మీకు ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలను మిగిలిన నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు చూసి ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తా..' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రకటించారు.





ఇంత దారుణమా..

గ్రామీణ నీటిపారుదల శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం తన పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తుండగా ఒక కుళాయి నుంచి నీరు మెల్లగా రావడం చూసి నిర్ఘాంతపోయారు.. కాసేపు దీర్ఘంగా చూస్తుండిపోయారిలా..!

మధ్యాహ్నం వచ్చారు.. సాయంత్రం వెళ్లారు!

పిఠాపురం శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తొలిసారి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనల్లో పాల్గొన్నారు. మండల కేంద్రాలైన గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లిల్లో సుడిగాలి పర్యటన జరిపారు. దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వివిధ వర్గాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలపై స్పందించారు. పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మిగిలిన వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మధ్యాహ్నం 12.36 గంటలకు చేరుకున్నారు. అక్కడ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని పిఠాపురం టీటీడీ కల్యాణమండంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు.అక్కడి నుంచి కొత్తపల్లి చేరుకుని పీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని చేబ్రోలు నివాసానికి చేరుకున్నారు. కారు నుంచే వినతిపత్రాలు స్వీకరించి సాయంత్రం 5.18 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లారు.





చేర నీ పాద దీపం..





గౌతమి ఘాట్ వద్ద మహాకాళేశ్వరుడు..పుష్కరఘాట్‌లో దీపం వదులుతున్న మహిళ.. పుణ్యస్నానం చేస్తున్న యువతులు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి తీరం కార్తీక శోభతో ప్రజ్వరిల్లింది. కార్తీక మాసం తొలి సోమవారం రాజమహేంద్రవరంలో గోదావరి రేవులన్నీ భక్తుల తో కిటకిటలాడాయి. వేకువ జామున మహిళలు పెద్ద ఎత్తున కోటీలింగాల రేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, మార్కండేయ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమ ఘాట్‌లలో పుణ్యస్నానాలు చేశారు. రేవుల్లో మెట్లపై ముగ్గుపెట్టి తమలపాకు లో పసుపు గణపతిని ఏర్పాటు చేసి పూజించారు. అనంతరం దీపారాధన చేసారు. కొబ్బరికాయ కొట్టి పూజాప్రక్రియ పూర్తి చేసి అనంతరం పురోహితులకు దీపదానాలు, శాలిగ్రామదానాలు సమర్పించారు. కార్తీక దీపాలను నదిలో విడిచిపెట్టారు. అనంతరం కోటిలింగాల క్షేత్రంలో ఉమాకోటిలింగేశ్వరస్వామి అమ్మవార్లను, పుష్కరాల రేవులో స్వామివారిని, టీటీడీ ఘాట్ వద్ద మార్కండేశ్వరస్వామిని దర్శించుకుని మహాశివునికి ప్రత్యేక అర్చనలు అభిషేకాలు చేశారు. దీంతో ఆయా ప్రాంతాలు భక్తులు కిటకిటలాడాయి,





కొవ్వూరులో గోదావరి మహానీరాజనానికి హాజరైన భక్తజనం..చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి తదితర నాయకులు(ఇన్‌సెట్‌లో) మహా నీరాజనం

కొవ్వూరులో భక్తజన హారతి

కొవ్వూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో భక్తితో దీప ప్రజ్వలన చేయడం వల్ల పరమాత్మ మనలో అజ్ఞానాన్ని తొలగించి వెలుగులు నింపుతాడని తితిదే దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. టీటీడీ ధర్మప్రచారంలో భాగంగా కార్తీకమాసం తొలి సోమవారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహా మంగళహారతిని అందజేశారు. ముందుగా టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు విశిష్టపూజలు చేశారు. గోదారమ్మకు వాయినం అందజేశారు. గోదావరి మాతకు ప్రతినిత్యం నీరాజనం అందజేయాలన్నారు. శివ, కేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో అరుణోదయానికి ముందు, సూర్యాస్తమయం తరువాత నదీ తీరంలో దీపాలు వెలిగించడం వలన అజ్ఞానం తొలగి జ్ఞానం పెంపొందుతుందన్నారు. దీపాలు వెలిగించే సమయంలో తూర్పు, ఉత్తర ముఖంగా పెట్టి వెలిగించాలన్నారు. నదీ స్నానం చేసిన, దర్శించినా, స్పర్శించినా, సేవించినా పుణ్యఫలం చేకూరుతుందన్నారు. కార్తీకమాసం మొదటి సోమవారం గోదావరి పుట్టుకకు కారణమైన పుణ్యక్షేత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదారమ్మకు మహా నీరాజనం అందజేయడం పుణ్యఫలం అన్నారు. అనంతరం ఆనందతీర్థాచార్యులు

గోదావరి మాతకు టీటీడీ మహానీరాజనం

ఆధ్వర్యంలో గోదారమ్మకు వివిధరకాల హారతులు అందజేశారు. తితిదే ఆధ్వర్యంలో మహా నీరాజనం జరగడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో గోష్పాదక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలివచ్చి మహాక్రతువును తిలకించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,టీటీడీ ట్రస్టుబోర్డు సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు, ఆర్డీవో రాణీ సుస్మిత, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, సుబ్బరాయచౌదరి,ఛైర్మన్ బావన రత్నకుమారి, మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు నీరాజనం తిలకించారు.

పాములకు.. మొక్కుదాం!

నేడు నాగుల చవితి





చవితి సందడి వచ్చేసింది.. ఇంటింటా ఆనందం తెచ్చేసింది.. కుటుంబంలో చిన్నా పెద్దా అంతా కలిసి చేసుకునే పండుగ నాగుల చవితి.. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకు నేందుకు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో ఉమ్మడి జిల్లాలో పాము పుట్టలు ఎక్కువగా ఉంటాయి.ఈ నేపథ్యంలో ప్రతి ఏడా ది ఆ పుట్టలు శుభ్రం చేస్తుంటారు. ఏడాదంతా పాము కనిపిస్తే చంపుదామని ప్రయత్నిస్తారు.. నాగుల చవితి రోజున మాత్రం పాము కనిపిస్తే పూజించడం మన సంప్రదాయం.

- సర్పపూజకు ప్రాధాన్యం
- పాము పుట్టలు ముస్తాబు
- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
- బిక్కవోలు ప్రసిద్ధి

అమలాపురం రూరల్/మండపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాములకు ఏడాదంతా ఒక లెక్క.. మంగళవారం ఒక లెక్క.. ఏడాదిలో ఏ రోజు పాము కనిపించినా భయపడతారు.. వెం టనే చంపేస్తారు.. అయితే మంగళవారం మాత్రం పాము కనిపించిందంటే మొక్కుతారు.. ప్రత్యేకంగా పూజలు చేస్తారు.. ఎందుకంటే నేడు కార్తీకశుద్ధ చతుర్థి.. దీనినే నాగుల చవితిగా నిర్వ హిస్తారు.. దీపావళి అనంతరం వచ్చే కార్తీకశుద్ధ చవితిని నాగుల చవితి చేస్తుంటారు. పాముల ఆరాధన ఈనాటిది కాదు.. ఎన్నో యుగాలనాటిది.సౌభాగ్యానికి, సత్సంతాన ప్రాప్తికి సర్పపూజ చేయడం లక్షల ఏళ్ల కిందటే ఉన్నట్టు ఎన్నో పురాణాలు చెబుతున్నాయి.ఈ మేరకు ఎన్నో ఆలయాల్లో నాగరాజు విగ్రహాలు కనిపిస్తాయి. ప్రధానంగా మహిళలు చవితిరోజు ఉపవాసం చేసి పుట్టల్లో గోక్షీరం పోస్తారు. నువ్వులు,బెల్లం కలిపిన చిమ్మిలి, గుడ్లు,తేగలు వంటివి వేస్తారు. పుట్టలు అందుబాటులో లేనివారు ఇంట్లోని పూజా మందిరంలో నాగదేవతను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. వెండితో గానీ, గంధపు చెక్కతోగానీ నాగేంద్రుడి ప్రతిమను తయారు చేసి అర్చన చేస్తారు. మహిళలు పుట్టమట్టిని నుదుటిన, కర్ణాలపైనా పూసుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలా పురం, కాకినాడల్లోనే కాక ఆయా మండలాల్లోని గ్రామాల్లోను పుట్టల వద్ద మంగళవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు నిష్ఠతో నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. చవితికి తూర్పుగోదావరి జిల్లా లోని బిక్కవోలు ప్రసిద్ధి.

ప్రకృతి ఆరాధన..

ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నాగుల చవితి పండుగ నిలుస్తుంది. నాగదోషం ఉన్నవారు నాగుల చవితి రోజున పుట్టలో తప్పక పాలు పోస్తారు. తమ దోషాలు తొలగించి సుఖసం తోషాలు ప్రసాదించమని నాగ దేవతలను వేడుకుంటారు. నాగుల చవితి రోజున పుట్టలో పాలు పోసి చలిమిడి, చిమిలి తమ గడపకు నివేదిస్తారు. పుట్టచుట్టూ పిండిని చల్లి ముగ్గులు వేయడం ద్వారా చీమలకు ఆహారం పెట్టడం ఏనాటి నుంచో ఉన్న ఆచారం. అందువల్ల ప్రకృతి లోని సకల జీవ జంతుజాలాన్ని సాటి ప్రాణులుగా ప్రేమించే ప్రగాఢ ఆత్మీయత.. ఆరాధించే నిరంతర అభ్యాసనం అలవడ్డాయి. ఆ పరంపరలోనే విష సర్పాలను సైతం పూజిస్తూ భక్తి ప్రపత్తులను చాటుకునే ఆచారం అనాదిగా ఉంది. సర్పారాధనకు తామరపుష్పాలు, కర్పూరం, పూలు, లడ్డూ మొదలైనవి శుభప్రదమైనవి. సర్పారాధన చేసేవారి వంశం తామర తంపరగా వర్ధిల్లుతోందని భవిష్య పురాణం చెబుతోంది.

పుట్టను దర్శించుకుంటే..

ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ-సంతాన శ్రేయస్సుకు, విషమ సమస్యల నివారణకు, సుఖ శాంతులకు, నేత్ర, కర్ణ, ఉదర సంబంధిత సమస్త వ్యాధుల నిర్మూలనకు నాగులచవితి శుభదినాన జరిపే నాగార్చన ఎంతో శ్రేష్ఠమైనదని శాస్త్రం చెబుతోంది. ప్రధానంగా మహిళలు చవితిరోజు ఉపవాసం చేసి పాముల నివాస స్థలాలైన పుట్టల్లో గోక్షీరం పోస్తారు.నువ్వులు, బెల్లం కలిపిన చిమ్మి, పండ్లు మొదలైన వాటిని నివేదన చేస్తారు. మహిళలు పుట్టమట్టిని నుదుటిన, కర్ణాలపైనా ధరిస్తారు. ఉపవశించిన వారు మర్నా డు ఓ బ్రహ్మచారైన పురోహితుడికి భోజన తాంబూలాదులు సమర్పించి ఆ తర్వాతనే ఉపవాస దీక్షను విరమిస్తారు.ఇలా చేస్తే సర్పదోషాలు, సర్పజాతి వల్ల కలిగే భయాలు,గండాలు తొలగిపోతాయని భక్తుల అచంచల విశ్వాసం.

స్వామిని చూద్దామని..

చాగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం శివయ్యకు ఎంతో ఇష్టమైన రోజు.. అందునా తొలి సోమవారం చాగల్లు శివాలయంలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఆ పరమ శివుడి నిత్యాభిషేకం కోసం ఆలయ పూజారి చెరుకూరి శివ సీతారామ్ తెల్లవారుజామున ఆలయం తలుపులు తెరవగా శివలింగానికి చుట్టుకుని నల్లత్రాచుపాము దర్శనం ఇచ్చింది. నాగేంద్రుడు దర్శనంతో తన జన్మ ధన్యమైందని భక్తి పారవశ్యంతో స్వామికి మొక్కుకున్నాడు. పాము ఉన్నంత సేపు ఆలయ ముఖద్వారం వద్దనే వేచి ఉండి వేదమంత్రాలతో స్వామివారిని స్మరించుకున్నాడు. కొద్దిసేపటి తరువాత ఆలయం బయటకు వచ్చి పడగలతో ఉండే నాగేంద్రుడి విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ కొద్దిసేపు పడగవిప్పి దర్శనం ఇచ్చింది. పూజారి భక్తులకు తెలియజేయడంతో ఆపరమ శివుడే ఆలయానికి విచ్చేశారని ఆనంద పారవశ్యం చెందారు. విషయం తెలుసుకుని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని భక్తితో పూజలు చేశారు. చాగల్లు శివాలయ చరిత్రలో ఇదొక అద్భుతమని భక్తులు భావిస్తున్నారు.



చాగల్లు శివాలయంలో నల్లత్రాచుపాము



సామర్లకోట భీమేశ్వరాలయం కోనేరు వద్ద తెల్లవారుజామున సూర్యోదయం

భానుడు గీసిన.. చిత్రమిది!

ప్రకృతి అంటేనే అందం.. ఆ అందాన్ని మనసారా ఆస్వాదించాల్సిందే.. తనివితీరా వీక్షించాల్సిందే.. ఈ చిత్రమే చూడండి ఎంత అందంగా ఉందో కదూ.. చిత్రకారుడు కలం నుంచి జాలువారి నట్టు ఉంది కదా.. కానే కాదు.. ఇది ప్రకృతి గీసిన చిత్రం.. సోమవారం తెల్లవారుతుండగా భానుడు ఇలా దర్శనమిచ్చాడు.. కార్తీక మాసం సోమవారం సందర్భంగా సామర్లకోట భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడుతోంది.. భక్తులంతా స్నానమాచరిస్తుండగా భీమేశ్వరాలయం వద్ద కోనేరులో తన ప్రతిరూపం తానే సూరీడు ఇలా ఉదయించాడు.. ఈ సుందర దృశ్యం ఆంధ్రజ్యోతి కెమెరాకు ఇలా చిక్కింది.. - సామర్లకోట



సామర్లకోటలో భీమేశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



పిఠాపురం పాదగయ పుష్కరిణి వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రాజమహేంద్రవరం గోదావరిలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో స్వామి దర్శనానికి వేచిఉన్న భక్తులు

ఆలయాల్లో 'కార్తీకం' సందడి

- కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల పుణ్యస్నానాలు

కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు.

వైభవంగా కోటిబిల్వార్చన

- అయ్యప్ప శరణుఘోషతో మార్మోగిన ప్రాంగణం
- కోలాహలంగా అయ్యప్పస్వాముల పేడధూళి
- లక్ష దీపాలతో ప్రత్తిపాడులో ఆధ్యాత్మిక సందడి





లక్ష దీపోత్సవాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు. పక్క చిత్రంలో పడిపూజకు హాజరైన భక్తులు

ప్రత్తిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మొదటి కార్తీక సోమవారం ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. ప్రత్తిపాడు మినర్వా కళాశాల సమీపంలో లక్షదీపాల మధ్య కోటి బిల్వార్చన పూజలు వైభవంగా జరిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు అనకాపల్లి, విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీ ఎత్తున అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. కేరళ సంప్రదాయ మంగళ వాయిద్యాల మధ్య పేడధూళి కార్యక్రమాన్ని కోలాహలంగా జరిపారు. అయ్యప్ప కోటిబిల్వార్చన ప్రాంగణం వద్ద ఉదయం గణపతి పూజ, మండపారాధన, లక్ష్మీ గణపతి హోమాలు, చండీహోమం, పూర్ణాహుతి యాగాలు చేశారు. దంపాళిగురువర్యుల గురుపూజోత్సవం చేశారు. అష్టాదశ కలశాలతో మహిళా భక్తులు స్వామి ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం పందల రాజవంశీకులు నారాయణవర్మ ప్రాంగణానికి చేరుకోగానే వేదపండితులు, అయ్యప్ప భక్తులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆయన లక్ష దీపోత్సవానికి దీపాన్ని వెలిగించి ప్రారంభించగా అయ్యప్ప భక్తుల శరణుఘోషతో కోటి బిల్వార్చన పూజలకు శ్రీకారం చుట్టారు. శబరిమలకు చెందిన ఆలయ పూజారి మేల్ శాంతి సంప్రదాయ పద్ధతిలో లక్ష బిల్వార్చన పూజ చేశారు. పడిపూజా కార్యక్రమానికి ప్రాంగణమంతా అయ్యప్ప భక్తులతో నిండిపోయింది. లక్ష దీపోత్సవంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా దీపాలను వెలిగించారు. కేరళలోని శబరిమల అయ్యప్ప సన్నిధానం మాదిరిగానే ఇక్కడ పూజలు చేశారు. అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

పులగుర్తలో ఆర్టీసీ బస్సు బోల్తా

• ముగ్గురికి గాయాలు • ఆసుపత్రికి తరలింపు • చెట్టు అడ్డు ఉండడంతో తప్పిన ముప్పు



అనపర్తి మండలం పులగుర్త వద్ద బోల్తాపడ్డ ఆర్టీసీ బస్సు

అనపర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు బోల్తాపడిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో రావులపాలెం బయలుదేరింది. అనపర్తి మండలం పులగుర్త వచ్చేసరికి అదుపుతప్పి రామచంద్రపురం- మండపేట కెనాల్ వైపు బోల్తాపడింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురై ఆర్తనాదాలు చేశారు. రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఉండటంతో బస్సు కాలువలోకి వెళ్ల లేదు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్ సహా 26 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు స్పందించి 108కి సమాచారం అందించి ప్రయాణికులను బయ టకు తీసుకు వచ్చారు. వీరిలో రాయవరం గ్రామానికి చెందిన బొడ్డు సూర్యకళ, తూరంగికి చెందిన కొప్పిశెట్టి అంజనేయరాజు, కె.మల్లవరం గ్రామా నికి చెందిన నూకల వీరభద్రరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూర్యకళ తలకు బలమైన గాయం కావడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు. బస్సు స్టీరింగ్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని డ్రైవర్ తెలిపారు.

కార్తీకమాసంలో పరమేశ్వరుని పూజ ఎంతో శ్రేష్టం

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పరమేశ్వరుని పూజించడం ఎంతో పుణ్యమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి కె.గంగవరంలోని శివాలయం ఆవరణలో ఆయన భక్తులను ద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్తీక మాసం విశిష్టత, పరమేశ్వరుడిని పూజించే విధానం, కార్తీకమాసంలో శివుడిని పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. తొలుత అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు చాగంటి ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆలకించారు.



గంగవరంలో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మరో ప్రపంచ రికార్డుకు శ్రీ చైతన్య విద్యార్థులు సన్నద్ధం

రాజమహేంద్రవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు మరో ప్రపంచ రికార్డుకు సన్నద్ధమవుతున్నారని యాజమాన్యం తెలిపింది. పదివేల మంది విద్యార్థులు 600 మ్యాథ్స్ ఫార్ములాలను ఏక కాలంలో పఠించడానికి ఏర్పాట్లు చేశారు. దీన్ని యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారంలో తిలకించడమే కాకుండా పర్యవేక్షించనున్నారు. తుది తీర్పు నవంబరు 6న వచ్చే అవకాశం ఉందని శ్రీచైతన్య యాజమాన్యం పేర్కొంది.

మాటలు కాదు..

చేతల్లో చేసి చూపిస్తున్నా!

- పిఠాపురం సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- పిఠాపురం సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తాం
- రూ.39.76కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు
- ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్
- సమస్యలు నా దృష్టికి తెస్తే తక్షణం పరిష్కరిస్తా
- గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ల్యాబ్‌లో విద్యార్థులతో పవన్‌కల్యాణ్ సెల్ఫీ

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని జడ్పీ బాలురఉన్నత పాఠశాల వేదికగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పలు అభివృద్ధి పనులకు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రజలు, మీడియాతో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ ప్రజలు బలంగా నిలబడి రాష్ట్రంలో, దేశంలో బలంగా నిలిపారని, మీ ఆశీస్సులతో డిప్యూటీ సీఎం అయ్యాయనని అన్నారు. మీ రుణం తీర్చుకునే విధంగా పనిచేసి చూపిస్తానని తెలిపారు.

పనులు చేసుకుంటూ వెళ్తా

ప్రతిరోజూ నేను స్వయంగా ఇక్కడకు రాలేకున్నా, నా మనస్సు అంతా ఇక్కడే ఉంటుందని డిప్యూటీ సీఎం పవన్ చెప్పారు. తాను నోటితో చెప్పనని పనులు చేసుకుంటూ వెళ్తున్నానని తెలిపారు. నా కళ్లు, చెవులు మీరే, ఏ సమస్యను అయినా నా దృష్టికి తీసుకురండి, దాన్ని పరిష్కరించేలా కృషి చేస్తానని ప్రకటించారు. తాను తరచూ ఇక్కడకు రాలేకున్నా, ఇక్కడ ఉన్న సమస్యలు, ప్రజలు ఇబ్బందులను ప్రత్యేకంగా అధికారులను పంపి తెలుసుకుంటున్నానని తెలిపారు. సుద్దగడ్డ వరదలు వచ్చినప్పుడు గొల్లప్రోలు జగనన్న కాలనీకి వచ్చి వారి కష్టాలు స్వయంగా చూశానని, రాకపోకలకు వారు పడుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తానని హామీ ఇచ్చానని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లా ఖనిజ నిధుల నుంచి బ్రిడ్జి నిర్మాణానికి కలెక్టరు ద్వారా రూ.4కోట్లు మంజూరు చేయించి ఈ రోజున శంకుస్థాపన చేశానని, అది తన నిబద్ధత అని తెలిపారు. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

పిఠాపురం ప్రాంత అభివృద్ధి సంస్థ ఏర్పాటు

పిఠాపురం నియోజకవర్గ పరిధిగా పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ఇది త్వరలోనే కార్యరూపం దాలుస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిగా ఉన్న పిఠాపురంసీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకుగాను అదనపు భవనాల నిర్మాణం, స్కానింగ్ సహా అన్ని అత్యాధునిక సదుపాయాల కల్పనకు రూ.39.76కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో రూ.14.38కోట్ల వ్యయంతో 223 సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని పవన్ చెప్పారు. మరో రూ.5.54కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలకు త్వరలోనే ఆమోదం లభిస్తుందని తెలిపారు. గొల్లప్రోలు, నాగులాపల్లి సీపీడబ్ల్యూఎస్ పథకాల మరమ్మతులకు రూ.56లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. పిఠాపురం పశువుల సంత ఆధునీకరణకు ఇచ్చిన మాట ప్రకారం రూ.1.34కోట్లను మంజూరు చేశామని, ఇప్పటికే టెండర్లు పిలిచారని తెలిపారు. విశాఖ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆగేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వన్నెపూడి ఎస్సీ కాలనీ శ్మశానవాటిక అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 22 సెంట్లు భూసేకరణ చేయడంతోపాటు రూ.28లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాస పెంపొందించేందుకు 33 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేబ్రోలులో కోటి రూపాయిలతో నగరవనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పిఠాపురంలో సీపేజీ వాటర్‌ప్లాంటు ఏర్పాటుకు ఆరు ప్రాంతాల్లో 2.40 ఎకరాలను సేకరించనున్నట్లు తెలిపారు. గొల్లప్రోలు డంపింగ్‌యార్డు ఏర్పాటు నిమిత్తం భూసేకరణ చేయనున్నామన్నారు.

పట్టురైతులకు తక్షణ పరిష్కారం

కర్నాటక రాష్ట్రం నుంచి పట్టు గుడ్లు తెచ్చి గూళ్లు కట్టకపోవడంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారంగా రూ.11లక్షలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అక్కడికక్కడే మంజూరు చేయించారు. కలెక్టరు అందించిన పరిహారం చెక్కును రైతులకు చూపించారు. పట్టుగూళ్ల కట్టకపోవడానికిగల కారణాలను గుర్తించేందుకు హిందూపురం నుంచి సెరీకల్చర్ రీసెర్చ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలను రప్పించామన్నారు. పట్టురైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు.

సెజ్ రైతుల ఇబ్బందులు పరిష్కరిస్తాం

కాకినాడ సెజ్ రైతుల ఇబ్బందులను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం పవన్ తెలిపారు. సెజ్ రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. భూములు ఇచ్చి రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరు షాన్‌మోహన్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, బుర్రా కృష్ణంరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు.



పట్టు రైతులకు చెక్కు అందజేస్తున్న పవన్



పవన్‌కు వినతిపత్రాలు ఇస్తున్న సెజ్ రైతులు, ఇతరులు



పిఠాపురం పట్టణం రథాలపేటలో సమస్యలు తెలుసుకుంటున్న పవన్‌కల్యాణ్



పోటీలో పాల్గొన్న మత్స్యకారులు

వలకట్ల స్థలం దక్కించుకునేందుకు...

గోదావరిలో వలకట్ల అత్తరాల (స్థలం) దక్కించుకోవడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో మత్స్యకారులు సోమవారం పడవల పోటీలు నిర్వహించారు. గోదావరికి వరదలు వచ్చినప్పటి నుంచి తగ్గే వరకు చేపల వేట నిలిపివేయడం మత్స్యకారుల కట్టుబాటు. వరద తగ్గిన అనంతరం బలుసుతిప్ప నుంచి కోటిపల్లి గోదావరిలో వలకట్ల (అత్తరాల) వేటాడే స్థలం కోసం 100 ఇంజన్ బోట్లతో పోటీలు నిర్వహిస్తారు. ఎవరైతే పోటీల్లో గోదావరిలో స్థలం దక్కించుకుంటారో మళ్లీ వరదలు వచ్చేవరకు చేపల వేటకు ఆ స్థలం వారి అధీనంలో ఉంటుంది. ఏటా మాదిరిగా దీపావళి అనంతరం పోటీలు జరిపారు. - కాట్రేనికోన



ప్రత్తిపాడులో మహిళా అఘోరా సందడి

కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సోమవారం ఒక మహిళా అఘోరా సందడి చేసింది. విజయవాడ నుంచి విశాఖపట్నం కారులో వెళుతూ పెట్రోలు కోసం బంకు వద్ద ఆగింది. దీంతో అక్కడే ఉన్న శివ, భవాని భక్తులు మహిళా అఘోరాను బయటకు రావాలని కోరగా ఆమె కారు దిగి కలియ తిరిగింది. భక్తులు నమస్కరించగా తిరిగి ఆమె కారు ఎక్కి వెళ్లిపోయారు. కాగా ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)





పురుషులు, మహిళల విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన సురేష్, నాగలక్ష్మీదుర్గలను అభినందిస్తున్న ఇన్‌చార్జి ఉప కులపతి శ్రీనివాసరావు

నన్నయ యూనివర్సిటీకి మంచిపేరు తేవాలి

ఉప కులపతి శ్రీనివాసరావు

అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక పోటీలు

దివాన్‌చెరువు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు మరింత క్రీడా స్ఫూర్తితో అఖిల భారత పోటీల్లో పాల్గొని విశ్వవిద్యాలయానికి మంచిపేరు తేవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు కోరారు. నన్నయ వర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ మహిళల, పురుషుల చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించారు. రాజానగరం నుంచి కానవరం వెళ్లి వచ్చే విధంగా 10 కి.మీ. మేర నిర్వహించిన ఈ పోటీలను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి, వీసీ మాట్లాడుతూ వివిధ గ్రామాల మధ్య నుంచి నిర్వహించే పరుగు పందెం పోటీలే క్రాస్ కంట్రీ పోటీలన్నారు.

పురుషుల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థి బి.సురేష్ 10 కి.మీ. పరుగును 36.50 నిమిషాల్లో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు. భీమవరం డీఎన్‌ఆర్ కళాశాల విద్యార్థి ఎం.లీలాగణేష్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం, భీమడోలు ఎస్‌వీ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.సాయిరామ్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు.

మహిళల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థి బి.నాగలక్ష్మీదుర్గ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వై.కౌశల్య ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం, కాకినాడ ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల విద్యార్థి ఎస్.శిరీష తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. పురుషులు, మహిళలు కేటగిరీల్లో నాలుగు, ఐదు, ఆరు స్థానాలు సాధించిన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన ఆరుగురు పురుషులు, మరో ఆరుగురు మహిళా విద్యార్థులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేశారు. మంగుళూరు విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి జరిగే అఖిల భారత క్రాస్ కంట్రీ పోటీల్లో వీరు పాల్గొంటారు. చెప్పారు. పురుషుల, మహిళల ఓవరాల్ చాంపియన్‌షిప్ విన్నర్స్‌గా నిలిచిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కార్యనిర్వాహక కార్యదర్శులు ఎ.సత్యనారాయణ, కె.బాలసత్యనారాయణ, పరిశీలకురాలు జి.ప్రమీలారాణి, ఎంపిక కమిటీ సభ్యులు బీవీ నరసింహరాజు, పి.సునీతమ్మ, రాజానగరం ఎస్ఐ నాగార్జున, విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ జట్టు ఎంపిక

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ జట్టు ఎంపిక పూర్తయినట్టు పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి కె.బాలసత్యనారాయణ తెలిపారు. పురుషుల జట్టులో బి.సుభేష్ (ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల, తణుకు), ఎం.లీలాగణేష్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), పి.సాయిరాం (ఎస్‌వీ డిగ్రీ కళాశాల, భీమడోలు) ఎ.మోహనకృష్ణప్రసాద్ (డీఎన్‌ఆర్ కళాశాల, భీమవరం), ఎ.శివాజీ (ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), బి.మోహనరావు (ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), మహిళా జట్టులో బి.నాగలక్ష్మీదుర్గ (ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు), వై.కౌసల్య (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.శిరీష (ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల, కాకినాడ), బి.శిరీష (సీఆర్ రెడ్డి మహిళా కళాశాల), ఎస్.రిషిత (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం), ఎన్.స్వాతి (సీఆర్ రెడ్డి కళాశాల, ఏలూరు) ఎంపికయ్యారు.

తండ్రిని హతమార్చిన తనయుడు

సోదరుడు, మేనత్తలపై దాడికి యత్నం

అడ్డుకున్న తండ్రిని కర్రతో కొట్టి చంపిన కొడుకు



మృతుడు తాతారావు (పాత చిత్రం)

తొండంగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కనిపెంచిన తండ్రిని కర్కశంగా కర్రతో కొడుకు కొట్టి చంపిన సంఘటన కాకినాడ జిల్లా తొండంగి మండలం గొల్ల ముసలయ్యపేటలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్ల ముసలయ్యపేటకు చెందిన యాదాల తాతారావుకు(66) ముగ్గురు సంతానం. వారిలో ఒకరు కుమార్తె కాగా... అర్జున్ ప్రథమ కుమారుడు, గోవిందు రెండో కుమారుడు. తాతారావుకు గల 9 ఎకరాల భూమిని పంచి ఇవ్వమని అనేక సార్లు అర్జున్ గొడవ పెట్టిన నేపథ్యంలో మూడు ఎకరాల చొప్పున భూమిని పంచి ఇచ్చాడు. తమ్ముడు వాటాలో ఒక ఎకరం రొయ్యల చెరువు రాగా తన జీవనాధారం కోసం తాతారావు తన దగ్గర ఉంచుకున్నాడు. అర్జున్‌కు సాధారణ భూమి వచ్చింది. తండ్రి వద్ద రొయ్యల చెరువు ఉంచుకోవడం అర్జున్‌కు నచ్చలేదు. దీంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. దాని కోసం తరచూ తండ్రితో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున గోవిందు, మేనత్త దండమ్మ ఇంటి వద్ద ఉండగా తలుపు తోసుకుని లోపలకు వెళ్లి గోవిందుపై దాడి చేసేందుకు అర్జున్ ప్రయత్నించాడు. దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన దండమ్మను కూడా తీవ్రంగా గాయపర్చడంతో ఆమె రోదనలు విన్న తాతారావు అక్కడకు రాగా అతడిపై కర్రతో దాడి చేయడంతో కుడి చెవి వద్ద, మెడపైన బలమైన గాయాలై తాతారావు అక్కడికక్కడే మృతి చెందాడు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ జగన్మోహన్ సంఘటనా స్థలిని పరిశీలించారు. మృతుడి చిన్న కుమారుడు గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాతారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అడవి పందుల వేటకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



రెవెన్యూ భూమిలో విగతజీవిగా తలుపులయ్య

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం భావారం-నరేంద్రపట్నం గ్రామాల మధ్య ఉన్న రెవెన్యూ భూముల్లో చాలా మంది విద్యుత్ వైర్లతో వన్యప్రాణులను వేటాడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి అడవి పందులను వేటాడడానికి విద్యుత్ వైర్లు అమర్చడానికి పోతురాజు తలుపులయ్య అనే వ్యక్తి వెళ్లాడు. ఈ క్రమంలో అతడే విద్యుత్ షాక్‌కు గురై మరణించినట్టు స్థానికులు చెప్పారు. అటవీ, విద్యుత్, పోలీసు శాఖల అధికారులు సంఘటనాస్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు జగ్గంపేట ఎస్ఐ రఘునందన్‌రావు చెప్పారు.

పోలవరం కాల్వలో దూకి వ్యక్తి ఆత్మహత్య

జగ్గంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పద్మనాభ నగర్ చెందిన చిక్కాల చక్రధర్ (27) బైక్ షోరూమ్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గోకవరం రోడ్డులోని పోలవరం కాల్వ వద్దకు వెళ్లి కొందరు మిత్రులకు ఫోనులో మెసేజ్‌లు పెట్టాడు. అనంతరం కాల్వలో దూకినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఆదివారం రాత్రి నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పోలవరం కాల్వలో చక్రధర్ విగతజీవిగా కనిపించగా బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి పంపించారు. ఆత్మహత్యకు గల కారణాలను సీఐ వైఆర్కే శ్రీనివాసరావు తెలుసుకుంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యుపాశం



వీర్రాజు, నాగేంద్ర, మణికంఠ, కృష్ణ... రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు వీరివి.. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ముందుంటారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటులో కూడా అంతే ఉత్సాహం చూపారు. 18 నెలలుగా వివాదం నెలకొనడంతో ఎప్పుడెప్పుడు విగ్రహావిష్కరణ జరుగుతుందా అని ఎదురు చూశారు. వేర్వేరు కారణాలతో ఇరు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు జరగ్గా జిల్లా అధికారులు, నాయకులు శాంతి చర్చలు జరిపారు. ఒక కమిటీ వేసి కొన్ని నిబంధనలతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిచ్చారు. దీంతో ప్రారంభోత్సవ ఏర్పాట్లలో భాగంగా భారీ ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతంతో ఆ నలుగురు యువకులూ తనువు చాలించారు.



నలుగురు మృతికి కారణమైన ఫ్లెక్సీ

- సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు
- ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం
- నలుగురు యువకుల దుర్మరణం
- తాడిపర్రులో తీవ్ర విషాదం
- గ్రామంలో 144 సెక్షన్ ఏర్పాటు
- ఫ్లెక్సీల తొలగింపునకు తహసీల్దారు ఆదేశాలు
- కన్నీరుమున్నీరుగా విలపించిన బంధువులు
- మృతుల కుటుంబాలకు మంత్రి దుర్గేశ్, కలెక్టర్ ప్రశాంతి పరామర్శ
- ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటన

ఉండ్రాజవరం/పెరవలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సోమవారం ఉదయం సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విగ్రహావిష్కరణను ఎంతో ఘనంగా నిర్వహించాలని తలంచారు. అనుకున్నదే తడవుగా 20 అడుగుల భారీ ఫ్లెక్సీ చేయించారు. దానిని ఎంతో ఉత్సాహంగా తీసుకొచ్చి తెల్లవారుజామున ఏర్పాటుకు ఉపక్రమించారు. ఐరన్ చట్రానికి ఫ్లెక్సీని అంటించి కర్రలతో నిలబెట్టే సమయంలో రోడ్డు పక్క నుంచి వెళ్లిన 6.3 కేవీ సింగిల్ ఫేజ్ వైరు తగిలింది. ఐరన్ చట్రానికి విద్యుత్ ప్రవహించగా ఫ్లెక్సీ పట్టుకున్న ఏడుగురు యువకుల్లో బొల్లా వీర్రాజు (26), పామర్తి నాగేంద్ర (25), మారిశెట్టి మణికంఠ (26), కాసగాని కృష్ణ (25) అక్కడికక్కడే మరణించారు. కోమటి అనంతరావు తీవ్ర గాయాలపాలయ్యాడు. వెలిగట్ల పవన్, కోమటి వీర వెంకట సత్యనారాయణలకు స్వల్ప గాయాలయ్యాయి. రోజువారీ కూలితో కుటుంబాలు నెట్టుకొస్తున్న పేదల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయి.

తాడిపర్రు గ్రామానికి చెందిన బొల్లా వీర్రాజుకు 14 నెలల కిందట పెళ్లయింది. రెండు నెలల పాప ఉంది. తల్లిదండ్రులు, భార్య ఉన్నారు. వ్యవసాయం, కొబ్బరి దింపు పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మళ్లీ వస్తానంటూ వెళ్లావు కదరా... త్వరగా రా అంటూ తండ్రి త్రిమూర్తులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

పామర్తి నాగేంద్రకు పట్టింపాలెం గ్రామానికి చెందిన దుర్గతో వివాహమైంది. వీరికి 8 నెలల పాప ఉంది. కొబ్బరి దింపు కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. భర్త మృతి వార్తను జీర్ణించుకోలేక పోతోంది. తనకు దిక్కు ఎవరూ అంటూ రోదిస్తోంది. తల్లిదండ్రులు శ్రీను, ఆదిలక్ష్మి, అన్నయ్య వెంకటకృష్ణ ఉన్నారు.

మణికంఠ పూల డెకరేషన్‌లకు వెళ్తుంటాడు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడికి భార్య భవాని, అమ్మాయి (5), అబ్బాయి (3) ఉన్నారు. నలుగురు తోబుట్టువులు ఉన్నారు. ఒక్కడే అబ్బాయి కావడంతో మణికంఠను అల్లారుముద్దుగా పెంచారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు పద్దయ్య, లక్ష్మి, సోదరీమణులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కాసగాని కృష్ణ పెయింటింగ్ షాపులో చిరుద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. తండ్రి రాము ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉన్నాడు. ఇటీవలే అనారోగ్యం రావడంతో వచ్చి ఆపరేషన్ చేయించుకుని నెల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో వారం, పది రోజుల్లో ఇండియా వచ్చేస్తాడని బంధువులు చెప్పారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో.... ఇక మేమెందుకు బతకాలంటూ తల్లి పద్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు కోడిగుడ్ల కట్టుబడి పనికి వెళుతుంటాడు. ఇతడికి ఇద్దరు మగ పిల్లలు. తీవ్ర గాయాలతో ఉన్న భర్తను చూసి భార్య, తల్లిదండ్రులు సత్యనారాయణ, వెంకటలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు.

తణుకు ఆసుపత్రిలో మృతదేహాలను మంత్రి కందుల దుర్గేశ్ పరిశీలించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికీ రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావు, వెలిగట్ల పవన్, కోమటి వీర వెంకట సత్యనారాయణలను మంత్రి దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.

తాడిపర్రులో ఘటనా ప్రాంతాన్ని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి సోమవారం పరిశీలించారు. సంఘటన పట్ల విచారం వ్యక్తం చేసి బాధిత కుటుంబీకులను ఓదార్చారు. గ్రామంలో మరో సామాజికవర్గంవారు తమపై తరచూ ఘర్షణకు దిగుతున్నారని గౌడ సామాజికవర్గ మహిళలు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ కారు ముందు నిలుచుని తమకు న్యాయం చేసి వెళ్లాలంటూ నినాదాలు చేశారు. ఆర్డీవో రాణిసుస్మిత, డీఎస్పీ దేవకుమార్ నచ్చజెప్పడంతో మహిళలు వెనుదిరిగారు.

మృతదేహాల రాకతో ఉద్రిక్తత..

తణుకు ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో మృతదేహాలు స్వగ్రామమైన తాడిపర్రుకు చేరుకున్నాయి. అప్పటికే సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం వద్దకు అధిక సంఖ్యలో మహిళలు, పురుషులు చేరుకున్నారు. మృతదేహాలను విగ్రహం వద్దనే ఉంచాలని.. వివాదానికి ఆజ్యం పోసేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వేరే సామాజికవర్గం యువకులను ఇక్కడకు తీసుకురావాలని వారంతా పట్టుబట్టారు. మహిళలు, గౌడ సామాజివర్గం నాయకులతో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడారు. వివాదాలకు ఇది సమయం కాదని సర్దిచెప్పారు. దీంతో మృతదేహాలను వాహనాల నుంచి కిందకు దింపి పాపన్న గౌడ్ విగ్రహం ముందు పెట్టి పువ్వులు చల్లి ఆయా కుటుంబీకుల ఇళ్ల వద్దకు చేర్చారు. అనంతరం మృతదేహాలను తీపర్రు తీసుకెళ్లి గోదావరి తీరంలో దహన సంస్కారాలు చేశారు. ఏ కార్యక్రమం జరిగినా ముందుండే యువకుల మృతిని గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారు.

ఒక వర్గానికి చెందిన ఫ్లెక్సీలు చించివేత

గ్రామంలోకి మృతదేహాలు వచ్చి వెళ్లిన అనంతరం కోపోద్రిక్తులైన ఒక వర్గం యువకులు గ్రామంలో వేరొక వర్గం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. పోలీసులు వద్దని వారిస్తున్నా వినకుండా రోడ్డు పొడవునా ఇరువైపులా పది నుంచి పదిహేను ఫ్లెక్సీలను చింపివేసి రోడ్డుపై పడవేశారు. అంతేకాకుండా కొంతమంది మరో వర్గం ఇళ్లపైకి వెళ్లిపోతుండగా పోలీసులు వారించి వెనక్కు తీసుకువచ్చారు. సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని సోమవారం ప్రారంభించడానికి ముందు రోజు అదే రోడ్డులో ఒక ఇంటి ముందు మరో సామాజికవర్గానికి చెందిన నాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. దానికి పోటీగా అదే సైజులో ఏడుగురు యువకులు సర్దార్‌పాపన్నగౌడ్ ఫ్లెక్సీని సోమవారం తెల్లవారుజామున ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. ఈ ఘటన అనంతరం తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్... గ్రామంలో ఎటువంటి ఫ్లెక్సీ ఉండరాదని, ఎవరు ఏర్పాటు చేస్తే వారే దానిని తీసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలా తొలగించని ఫ్లెక్సీలను పంచాయతీ తరపున తొలగిస్తామని ఆటో ద్వారా ప్రచారం చేయించారు. దీంతో కొన్ని ఫ్లెక్సీలను ఎవరికి వారు తొలగించగా.. మరికొన్ని ఫ్లెక్సీలను పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఇరు సామాజికవర్గాల మధ్య గొడవలు జరిగే సూచనలు కనిపించడంతో తాడిపర్రులో సెక్షన్ 144 విధించారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన వారితో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పరామర్శించారు. సంఘటనా స్థలానికి వెళ్లి మృతులకు సంతాపం తెలిపారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మాట్లాడుతూ.... నలుగురు యువకుల మృతి బాధాకరమని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. తమ సామాజికవర్గానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడం బాధాకరమని గౌడ సంఘ మాజీ అధ్యక్షుడు మోతుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోనే ఈ ఘోరం జరిగిందన్నారు.









వీర్రాజు, నాగేంద్ర (పైన)
మణికంఠ, కృష్ణ (కింద)

తాడిపర్రు ఘటనపై ఎంపీ పురందేశ్వరి దిగ్భ్రాంతి

ఆస్ట్రేలియా నుంచి ఫోన్ ద్వారా మృతుల కుటుంబాలకు సానుభూతి సందేశం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో నలుగురు యువకులు మృతి చెందిన ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆమె తాడిపర్రు దుర్ఘటన గురించి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి విషయాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారిని ఆదుకుంటామన్నారు.



తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



స్థానికులతో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రమాదం విచారకరం

బాలగంగాధర్‌తిలక్, ట్రాన్స్‌కో ఎస్ఈ

తాడిపర్రులో విద్యుత్ ప్రమాదంలో నలుగురు మృతి చెందడం విచారకరం. ఫ్లెక్సీలు కట్టిన ప్రాంతంలో 6.3 కేవీ విద్యుత్ లైన్ ఉంది. 3 అడుగుల దూరంలో ఏది ఉన్నా కరెంట్ షాక్ కొడుతుంది. ఫ్లెక్సీలను నేల నుంచి 6 నుంచి 10 అడుగులు లోపే పెట్టుకోవాలి. ఎత్తు పెరిగితే ప్రమాదాలు జరుగుతాయి. మృతుల కుటుంబాలకు తమ శాఖ తరపున ప్రభుత్వానికి నివేదిక పంపుతాము.

తణుకు ఆస్పత్రికి మృతదేహాలు



తణుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన నలుగురు మృతదేహాలను తణుకులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆసుపత్రి ప్రాంగణం నిండిపోయింది. విషయం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేశ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆస్పత్రి వద్దకు వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. శవ పంచనామా నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన కోమటి అనంతరావుకు గాయాలు కావడంతో తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

గంజాయి మత్తులో యువత నిర్వీర్యం

» మంత్రి కందుల దుర్గేష్

» హత్యాచార బాధిత కుటుంబానికి పరామర్శ, స్వీయ నిధులు రూ. లక్ష సాయం అందజేత



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దుర్గేష్

కడియం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో యువత నిర్వీర్యం అయిపోతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుర్రిలంకలో హత్యాచార బాధిత కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించి స్వీయ నిధులు రూ.లక్ష అందజేశారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో గంజాయి మత్తులో చెలరేగిన అవశేషాలు, మిగిలిపోయాయనడానికి ఈ ఘటన నిదర్శనం అన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపాలని డీఎస్పీ భవ్యకిషోర్‌కు సూచించారు. గంజాయి మూలాలను పూర్తిగా నిర్మూలించాలని అకృత్యాలను అరికట్టాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నిరంతం నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, మార్గాని ఏడుకొండలు, గట్టి నర్సయ్య, ముద్రగడ జమీ, గెడ్డం శివ, పంతం గణపతి, కలిదిండి గోవిందు, ఆదిమూలం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ సీఐతో నాకు ప్రాణహాని

» నాకేమి జరిగినా అతనే బాధ్యుడు » కార్మిక నాయకుడు గంగాధరరావు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెనుగొండ సీఐ విజయకుమార్ నుంచి తనకు ప్రాణహాని ఉందని రాజమహేంద్రవరానికి చెందిన ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకుడు వాసంశెట్టి గంగాధరరావు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం వైజంక్షన్ ఆనం రోటరీ హాలులో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది జూన్‌లో బొమ్మూరు స్టేషన్ పరిధికి చెందిన ఒక యువతిని ఓ యువకుడు ట్రాప్ చేశాడు. ఈ సంఘటనపై యువతి తల్లిదండ్రులు తన వద్దకు వస్తే తాను అప్పటి బొమ్మూరు సీఐగా పనిచేసిన ఆర్.విజయకుమార్‌ను కలిసి సమస్యను వివరించానన్నారు. దీనిపై సీఐ చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించడమే కాకుండా..రూ.50 వేలు తీసుకుని సమస్యను పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో సీఐకు, తనకు మధ్య విభేదాలు ఏర్పడడంతో ఎస్పీ, ఏలూరు డీఐజీ, డీజీపీని కలిసి ఫిర్యాదు చేశానన్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో హైకోర్టులో రిట్ పిటీషన్ వేశానన్నారు. అయితే సీఐ అప్పటి నుంచి తనను టార్గెట్ చేశారని.. కోర్టులో వేసిన కేసు వాపస్ తీసుకోకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. సీఐ నుంచి త్రెట్ ఉందని.. ఆధారాలన్నీ తన వద్ద ఉన్నాయన్నారు. అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సర్వసిద్ధి నాగరాజు మాట్లాడుతూ తాను ఒక స్థలం కొని మోసపోయానని, దాని విషయమై న్యాయం చేయమని బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఐ విజయకుమార్ దగ్గరుండి దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. ఈ కేసు విషయంలో తనకు న్యాయం చేయలేదన్నారు.

నిపుణ్ భారత్ లక్ష్యాలు సాధించేందుకు కృషి

దివాన్‌చెరువు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఈసీసీఈ ప్రవేశ పెట్టినట్టు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్ అన్నారు. మండలంలోని కొండగుంటూరు సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ శిక్షణా కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) రెండో దశ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రథమ్, ఆసర్ వంటి స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోందన్నారు. బొమ్మూరులోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీ మాట్లాడుతూ విద్యార్థి దశలో ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక భావనలు తెలియాలన్నారు. శిక్షణా కేంద్రం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఒకటి, రెండు తరగతులు పూర్తి చేసి 3వ తరగతిలోకి చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం గణితంలో చతుర్విధ ప్రక్రియలపై నైపుణ్యాన్ని సాధించాల్సి ఉందన్నారు. సమావేశంలో డైట్ లెక్చరర్ గంగాధర్,ప్రథమ సంస్థ కోఆర్డినేటర్ జగదీష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ జానకీదేవి, సమగ్రశిక్ష వాటర్ నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈవోలు నాగరాజు, సుబ్బరాజు, చందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

50 పడకల ఆసుపత్రిని సాధిస్తా

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గోకవరం ప్రభుత్వాసుపత్రికి 50 పడకల ఆసుపత్రి హోదా కల్గేలా కృషి చేస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య గతం కంటే ఇప్పుడు గణనీయంగా పెరిగిందన్నారు. రోగుల పట్ల వైద్యులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన సత్యసాయిబాబా తాగునీటి ట్యాంక్‌లను, మరొక ట్యాంక్ నిర్మాణపు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి అక్కడ నెలకొన్న సమస్యలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రికి కుర్చీలు బహూకరణ

ఆసుపత్రిలో రోగులు కూర్చోవడానికి సైతం కుర్చీలు లేక పడుతున్న ఇబ్బందులపై వైద్యానికి వెళ్తే కాళ్లకు నుస్తి అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం వెలువడిన కథనానికి దాతలు స్పందించారు. స్థానిక 12వ వార్డు సభ్యుడు చిటికిల పాండు సుమారు 25 ప్లాస్టిక్ కుర్చీలను సమకూర్చారు. వాటిని ఎమ్మెల్యే నెహ్రూ చేతుల మీదుగా ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు.

నిత్యావసరాల ధరలను అదుపుచేయాలి

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామన్య ప్రజల రక్తాన్ని పీల్చుతున్నాయని, మార్కెట్‌లో ధరలు పెరగకుండా ప్రభుత్వం అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య నగర, జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దుర్గా భవాని మాట్లాడుతూ నిత్యావసరాలు, కూరగాయల ధరలను నియంత్రించేలా ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్నారు. మంచి ప్రభుత్వం అంటే ధరలు తగ్గించే విధంగాచర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ హింస ప్రతి ఏటా పెరిగిపోవడానికి మద్యమే కారణమని, మద్యం నియంత్రణ చేసి మహిళల గౌరవాన్ని కాపాడి ధర్మాన్ని రక్షించాలని కోరుతున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఎప్పుడు ఇస్తారని అన్నారు. మహిళా సాధికారత కోసం, మహిళా హక్కుల కోసం మహిళా సమాఖ్య పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహిళా నాయకురాలు సేపేని రమణమ్మ, యడ్ల లక్ష్మి, నాగమణి, కొండవతి లావణ్య, రవణమ్మ తదితరులు మాట్లాడారు. మహిళలు పాల్గొన్నారు.

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ

బిక్కవోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నైపుణ్య గణనపై గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ వి. శ్రీనివాస్ మాట్లాడుతూ నైపుణ్య గణను ఖచ్చితత్వంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పికెఎస్. సుధారాణి, పరిపాలనాధికారి విడి.రత్నకుమార్, మాస్టర్ ట్రైనీలుగా పందలపాక, తొస్సిపూడి, బిక్కవోలు డిజిటల్ అసిస్టెంట్‌లు నూరిశెట్టి సురేష్, ఎం. సోమిరెడ్డి, ఎం.గులాంరబ్బానిలు వ్యవహరించారు. మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మౌళిక సదుపాయాలు, పారిశుధ్య సమస్యలు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలో మౌళిక సదుపాయాలు, డ్రైనేజీవ్యవస్థలను మెరుగుపర్చాలని కోరూతూ ప్రజలు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్‌కు అర్జీలు అందించారు. సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన పిజిఆర్ఎస్ మీకోసంలో కమిషనర్ కేతన్ గార్గ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగరంలో నెలకొన్న డంపింగ్ యార్డ్‌వల్ల దుర్గదంగా మారిన ప్రాంతాల ప్రజలు,మెరుగైన పారిశుధ్యం వీధి దీపాల సమస్యల పరిష్కారంకోసం అర్జీలు అందించారు.

రైతుల సంక్షేమానికి కృషి

కడియం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం కడియంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, కూటమి నాయకులు చిలుకూరి నాగేశ్వరరావు, బోణం సత్యనారాయణ, తహసీల్దారు పోశియ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది, సొసైటీ సీఈవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మింగేశారు!

» సుందరీకరణ పేరుతో రూ.కోటిన్నర వృథా

» ఉన్న వసతులను మూసివేసి అభివృద్ధి పనులు

» బలభద్రపురంలో పెద్ద చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



పనుల్లో లోపాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం బలభద్రపురంలో గత వైసీపీ పాలనలో రూ.1.50కోట్ల నిధులతో చేపట్టిన పెద్ద చెరువు సుందరీకరణ పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆర్ఎమ్‌సీ ఇంజనీర్ల బృందంతో కలిసి పరిశీలించారు. బలభద్రపురంలోని 8.90 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువు సుందరీకరణకు అప్పటి ప్రభుత్వం రూ.1.50 కోట్ల రుడా నిధులు మంజూరు చేసింది. ఈ పనుల నిర్వహణను రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. అయితే సుందరీకరణ పేరుతో జరిగిన నాసిరకం పనులు, గతంలో ఉన్న సౌకర్యాలను తొలగించడం, చెరువుకు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో జరిగే మార్గాలను మూసివేయడం, చెరువులో చేపలు పట్టుకుని జీవిస్తున్న 250 మంది మత్స్యకారులకు జీవనోపాధి పోవడం వంటి అంశాలను గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనితో ఆయన ఉన్నతాధికారులకు విషయం చెప్పడంతో రెండు నెలలుగా అధికారులు దాటవేత ధోరణి అవలంబించారు. చివరకు సోమవారం ఆర్ఎమ్‌సీ ఈఈ ఆలీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు చెరువు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెరువును పరిశీలించి అధికారులు చేసిన తప్పులను గ్రామస్థుల ఎదుటే నిలదీశారు. చెరువు ద్వారాలను మూసి వేయడం వల్ల.. కాపవరం వెదుళ్ల చెరువు నిండితే ఆ నీరంతా పెద్ద చెరువుకు చేరుతుందని, దీంతో గ్రామం ముంపుకు గురవుతుందన్నారు. వాకింగ్ ట్రాక్ కూడా పూర్తి చేయలేదన్నారు. పంచాయతీకి చెరువును అప్పగించకుండా బిల్లులు పూర్తిగా ఎలా చెల్లించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ చెరువు సుందరీకరణ పనుల్లో జరిగిన అవకతవకలు, అవినీతిపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నల్లమిల్లి సుబ్బారెడ్డి, పురుషోత్తమరెడ్డి, గ్రామస్థులు, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ అధ్యక్షుడిగా శ్రీధర్

కడియం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాజమహేంద్రవరం రూరల్ అధ్యక్షులుగా, కడియం సీహెచ్‌సీలో వైద్యులుగా విదులు నిర్వహిస్తున్న డా. టీ వీ శ్రీధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చిరుకూరి ప్రభాకర్, సూపరెండెంట్ డా. రత్నకుమారి, డా. మోహన్‌వంశీ, డా. శిరీష, నర్సింగ్, ఫార్మసీ, రేడియాలజీ, ల్యాబ్‌సిబ్బంది హర్షంవ్యక్తం చేసారు.

14 నుంచి మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ

10వ తేదీ వరకూ దరఖాస్తులకు గడువు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం (బీసీ స్టడీ సర్కిల్)లో మెగా డీఎస్సీ ఉచిత శిక్షణా తరగతులు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయని తూర్పుగోదావరి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి, స్టడీ సర్కిల్ సంచాలకులు బి.శశాంక తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ టెట్‌లో అర్హత సాధించి, ఆసక్తి కల్గిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మెగా డీఎస్సీ-2024 పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్, ఎస్జీటీ టెట్ క్వాలిఫైడ్ సర్టిఫికెట్ల జెరాక్సులతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, సెల్ఫ్ అడ్రెస్ కవర్ జతచేసి 'టు ది డైరెక్టర్, ఏపీబీసీ స్టడీ సర్కిల్, ఆర్ట్స్ కళాశాల దగ్గర, రాజమహేంద్రవరం - 533 103' అనే చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరలా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, శిక్షణా తరగతులతోపాటు ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ప్రాక్టీసు టెస్టులు, గ్రాండ్ టెస్టులు కూడా నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ : 90323 97808, 93939 34825 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ప్రజల అభిరుచికి తగ్గట్టుగా అభివృద్ధి

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల అభిరుచికి తగ్గట్టుగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో రుడా ఆధ్వర్యంలో గౌతమి గ్రంథాలయంలో నిర్మించిన కాంపౌండ్ వాల్, లైటింగ్ ఆర్చ్, రీడింగ్ హాలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ప్రజలకు ఆహ్లాదం, విజ్ఞానం అందించే విధంగా ప్రాధాన్యమిస్తూ పనులు చేపడుతున్నామన్నారు. ఇదిలా ఉండగా మెయిన్ రోడ్డు నల్లమందు సందు ప్రారంభంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖాధికారులతో కలిసి ఎమ్మెల్యే వాసు పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎవ్వరికి ఇబ్బందికలుగకుండా 8 అడుగుల ఎత్తులో ఉంచేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో పేరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రజా ఇబ్బందులను నియంత్రించే దిశగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. పెద్దపెద్ద షాపుల ముందు వాహనాలు భారీగానిలిచిపోకుండా యజమానులు సెక్యూరిటీ గార్డులను పెట్టుకుని వాహనాలను క్రమపద్ధతిలో పెట్టుకోవాలన్నారు. నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట చాంబర్ సభ్యులు, కూటమి నాయకులు, వ్యాపారులు ఉన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు..

ఆసుపత్రికి తరలింపు

కడియం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కడియం మండలం కడియపులంక జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో అమలాపురానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 3వ తేదీ రాత్రి 11గంటల సమయంలో అమలాపురానికి చెందిన అడ్డాల అరుణ్‌కుమార్(43) నడుచుకుంటూ వెళ్తుండగా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన సీహెచ్ శివకుమార్ మోటారుసైకిల్‌పై వెళుతూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో అరుణ్‌కుమార్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితోదాడి చేసిన వ్యక్తికి 3నెలలు జైలు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఏసీ గార్డెన్స్ లో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఆటో డ్రైవర్ కు రాజమహేంద్రవరం సెకండ్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి 3 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. 2022 డిసెంబరు 2న హుక్కంపేటకు చెందిన సిద్దాని వెంకట రామలింగేశ్వరావు స్థానికి ఆల్‌కట్‌తోట రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా తాడితోటకు చెందిన శీలం దుర్గాప్రసాద్ తన ఆటోతో అసౌకర్యం కలిగించడంతో ఆటోడ్రైవర్‌ను ప్రశ్నించినందుకు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ వెంకట రామలింగేశ్వరావుపై చాకుతో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై అప్పట్లో వన్‌టౌన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసుకుసంబంధించిన పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈనెల 4న తీర్పును వెల్లడించారు. దుర్గాప్రసాద్‌కు రూ10వేలు జరిమాన విధించారు.

ఫసల్ బీమాను వినియోగించుకోవాలి

ఉద్యానశాఖాధికారి దివ్యశ్రీ

ఉద్యాన, వ్యవసాయం సహాయకులకు అవగాహన, శిక్షణా కార్యక్రమం

రాజానగరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీడి మామిడి తోటల రైతులు ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి ఉద్యానశాఖ అధికారిణి దివ్యశ్రీ పిలుపునిచ్చారు. రాజానగరంలోని రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే)లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రంగంపేట, రాజానగరం, బిక్కవోలు, అనపర్తి మండలాల ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు రబీ సీజన్ 2024-25 జీడిమామిడి పంట బీమాపై అవగాహన, శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టం జరిగిన జీడి మామిడి రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో పంట బీమా పథకం అమలు చేస్తోందన్నారు. జిల్లాలో జీడి మామిడి పంట బీమా చేసేందుకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేశారన్నారు. మూడేళ్లు దాటిన పంటకు రైతులు స్వచ్ఛందంగా నమోదు చేయించుకునేందుకు ఒక రైతు ఒక ఎకరానికి రూ.1500 చెల్లిస్తే రూ.30 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలని రైతులకు సూచించారు. కస్టమర్ సర్వీస్ సెంటర్స్(సీఎస్‌సీ) లేదా బ్యాంకులో/ఎన్‌సీఐపి పోర్టల్‌లో గానీ నమోదు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఈ నెల 6న పంట నమోదు చేయించాలని ఆదేశించారు. మరిన్ని వివరాలకు ఇఫ్కో జిల్లా కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ 92900 33325 నెంబరులో సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాసంశెట్టి పెద వెంకన్న, నీలపాల అరవరాజు, కుర్రే నాగబాబు, పిడుగు సురేష్, రంగంపేట హెచ్ఈవో అరవింద్ సాయి, ఏఈవోలు వెంకటేష్, శ్రీరంగా పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమను మూసేయాలి

గోకవరం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గుమ్మళ్ళదొడ్డిలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను మూసేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడీఎస్‌యూ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. ముందుగా ప్రజా సంఘాల ప్రతినిధుల బృందాన్ని వీరలంకపల్లి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ప్రజా సంఘ నాయకుల మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. తరువాత చోటుచేసుకున్న పరిణామాల అనంతరం అస్సాగో పరిశ్రమను పరిశీలించేందుకు ప్రజా సంఘాల ప్రతినిధుల బృంధానికి అనుమతి లభించింది. దీంతో ప్రజా సంఘ నాయకులు ఆందోళన విరమించి పరిశ్రమను పరిశీలించారు. ఈసందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల సమీపంలో ఉన్న గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. దుర్వాసనతో పాటు, శబ్దాలు, భూగర్భ జలాలు కలుషితమై మంచినీటి కొరత ఏర్పడుతుందన్నారు. పంచాయితీ తీర్మానాలు లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా కేవలం నియంతృత్వ భావాజాలంతో ప్రజలను భయపెట్టి కంపెనీని ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రజా ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం వేసిన విచారణ కమిటీ చిత్తశుద్ధితో, నిష్పక్షపాతంగా విచారణ చేసి రిపోర్టులను గ్రామ సభల ద్వారా ప్రజలకు వెల్లడించాలని డిమాండు చేసారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఆర్డీవో, ఉన్నత అధికారులు సమస్యలను తెలుసుకొని కంపెనీని మూసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రధాన రహదారిలో మద్యం షాపు తొలగించాలి

● తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన మహిళలు



సీతానగరం, నవంబర్ 4: సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వెళ్ళే ప్రధాన రహదారిలో జనవాసాల మధ్య మద్యం షాపు తొలగించాలని కోరుతూ స్థానిక మహిళలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. బైర్రాజు రాజ్యలక్ష్మి, సుబ్బలక్ష్మి, పిల్లి పుష్ప , నంబూరి పద్మావతి, కుచ్చెర్లపాటి పద్మ, పేరిచర్ల పద్మలత, తోలేటి మాధవి బైర్రాజు శివనాగరాజు , పిల్లి సూరిబాబు తదితరులు సీతానగరం తహసల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కార్యాలయంలో లేకపోవడంతో కార్యాలయం వద్ద కొంత సేపు నిరసన తెలిపి మద్య షాపు ప్రధాన రహదారిలో తొలగించాలని నినాదాలు చేసారు.అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భారతిని కలసి మద్యం షాపువలన పడుతున్న బాధలను వెంర పెట్టుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతానగరం ప్రధాన రహదారి నుంచి మార్కెట్‌కు వెళ్ళే రోడ్డులో జనవాసాల మధ్య పెట్టారని , బ్రాందీ షాపును ఆనుకుని చాలా కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు.బ్రాందీ షాపు వద్ద తాగేసిన వ్యక్తులు ఇష్టం వచ్చినట్లు కేకలు వేస్తూ తినేసిన పదార్థాలను కాగితాలు చెత్తా చెదారం అక్కడే పడేస్తున్నారని చాలా ఇబ్బందిగా ఉందని బయటకు రావాటంటేనే భయంగాఉందని అన్నారు. ఇప్పటికే సారా వ్యాపారం జోరుగా సాగుతోందని దీనికి తోడు మద్యం షాపుల వలన ఇళ్ళ వద్ద నా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మద్యంషాపును వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.ఈ విషయమై సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో షాపు తొలగించాలని ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 5 నవంబరు 2024 | 5





ఈ విగ్రహావిష్కరణకే.. ఏర్పాటు



ప్రమాదానికి కారణమైన ఫ్లెక్సీ ఇదే..



మృతుల కుటుంబీకుల రోదన

ఆవిరైన.. ఆనందం

ఫ్లెక్సీ పెడుతుండగా విద్యుదాఘాతం.. నలుగురి మృతి



సంఘటన జరిగిన తాడిపర్రు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం..సముదాయిస్తున్న పోలీసులు

సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం.. రెండు సామాజిక వర్గాల మధ్య పోరాటం.. ఒకరు విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటే.. మరొకరు విగ్రహం ఎలాగైనా ఏర్పాటు చేయాలని తలంచారు.. గత 18 నెలలుగా ఎదురుచూపులు.. విగ్రహావిష్కరణ రోజు రానే వచ్చింది.. పట్టలేనంత ఆనందం.. ఆ వేడుక ఎంతో ఘనంగా నిర్వహించాలని తలంచారు.. ఆ ఆనందం వెంటే విషాదం ఉందని ఊహించలేదు.. ఆదివారం ఉదయం అంతా విగ్రహావిష్కరణ కార్యక్రమాల్లోనే కలియతిరిగారు.. తెల్లవారితే విగ్రహావిష్కరణ.. ఒక పక్క భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.. మరో పక్క టెంట్‌లు.. కుర్చీల ఏర్పాట్లలో మరికొందరు ఉన్నారు.. ఎవరి ఏర్పాట్లలో వారుండగానే ఏడుగురు యువకులు 20 అడుగుల భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు.. సోమవారం తెల్లవారుజాము కావడంతో పైన ఏమి ఉందో కనిపించలేదు.. అంతే ఒక్కసారిగా ఫ్లెక్సీని పైకెత్తారు.. అంతే ఆ ఫ్లెక్సీ విద్యుత్ వైర్లకు తగలడంలో ఫ్లెక్సీకి ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేమ్‌కు విద్యుత్ పాస్ అయ్యింది.. నలుగురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు.. మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు.. మరో ఇద్దరు స్వల్పగాయాలపాలయ్యారు. అంతే అప్పటి వరకూ ఎంతో సందడిగా ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా మూగబోయింది.. గ్రామస్తులు విగజీవులుగా పడి ఉన్న నలుగురిని పట్టుకుని సపర్యలు చేస్తూనే ఉన్నారు..ఒరేయ్ లేవండిరా..లేవండిరా అంటూ అంతా చుట్టూచేరి పిలుస్తూనే ఉన్నారు.. అయినా చలనం లేదు.. నలుగురు యువకుల్లో ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి.. పిల్లలు ఉన్నారు.. ఒకరికి మాత్రమే పెళ్లికాలేదు.. కుటుంబీకులు అంతా చేరి మృతదేహాలను పట్టుకుని బోరుమన్నారు.. ఇక మాకు దిక్కెవరంటూ కన్నీటి పర్యంతమయ్యారు.. అప్పటి వరకూ ఎంతో సందడిగా అరుపులు.. కేకలతో ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా రోధనలతో మిన్నంటింది.. ఆనందం కాస్తా ఆవిరైంది.. -7లో

కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌కు 125 అర్జీలు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ సమస్యలతో వస్తున్న అర్జీలు ఏ ఒక్కటి పెండింగ్‌లో లేకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు.నిర్లక్ష్యం వహించకుండా అర్జీలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం పీజీఆర్‌ఎస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సకాలంలో ప్రజలకు నాణ్యమైన సేవలందించాలన్నారు.జిల్లాలో ప్రజల నుంచి 126 అర్జీలు స్వీకరించినట్లు జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో టి రామచంద్రమూర్తి, సీపీవో అప్పల కొండ , డీఆర్‌డీఏ పీడీ మూర్తి పాల్గొన్నారు.

మస్తర్ల మాయాజాలంపై గ్రామంలో విచారణ

డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు

రాజానగరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'మస్తర్ల మాయాజాలం' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం మండలంలో కలకలం రేకెత్తించింది.ముక్కినాడలో చేపడుతున్న ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు దొంగ మస్తర్లు నమోదు చేయడంపై గ్రామానికి చెందిన కొంత మంది బొమ్మూరులోని కలెక్టర్ పీజీఆర్‌ఎస్‌లో 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంతో కూడిన జిరాక్స్‌ను, ఉపాధి పనుల్లో అవకతవలకు సంబంధించిన ఆధారాలను డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావుకు అందజేశారు. దీనిపై పీడీ స్పందించి డ్వామా ఏపీడీని విచారణాధికారిగా నియమించామని, తక్షణమే గ్రామ సభలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 25 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీ కోసం)ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఎస్పీ నరసింహ కిషోర్ స్వయంగా మాట్లాడి ఫిర్యాదు వివరాలను తెలుసుకున్నారు. ఆయా స్టేషన్ల బాధ్యులతో ఫోన్‌లో మాట్లాడి తగు ఆదేశాలిచ్చారు. సివిల్, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాటలు,దొంగతనాలకు సంబంధించిన 25 ఫిర్యాదులను స్వీకరించారు.



ఓటేద్దాం! మాస్టారు!

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- ఈ నెల 11న నోటిఫికేషన్
- వచ్చే నెల 5న పోలింగ్
- 9న ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉభయగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది.పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు.వాస్తవానికి ఆయన పదవీ కాలం 2027 మార్చి 29వ తేదీ వరకూ ఉంది.కానీ ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈఎన్నిక జరగనుంది.ఈ ఉప ఎన్నికకు ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుంది.18వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు.19న నామినేషన్ల స్క్రూటినీ చేస్తారు. 21 అభ్యర్థుల విత్‌డ్రాకు చివరి తేదీ. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుంది.9న ఓట్లను లెక్కిస్తారు.12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక అంటే చాలా ప్రతిష్టాత్మకంగా జరుగుతోంది. ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయవర్గాలకు ఓటు హక్కు ఉంటుంది. ఉపాధ్యాయు వర్గాల నుంచే పోటీ చేయవలసి ఉంది. ఎలిమెంటరీ, యూపీ స్కూళ్ల టీచర్లకు ఓటు హక్కు లేదు.ప్రభుత్వ ప్రైవేట్ హైస్కూళ్లు, కాలేజీలు,యూనివర్శిటీలు,ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే అధ్యాపకులందరికీ ఓటు హక్కు ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల ఓటు హక్కుకు అర్హతను హెచ్‌ఎం, కళాశాలలో ప్రిన్సిపాల్స్ సిఫారసు చేస్తారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో టీచర్ల అర్హతను డీఈవో సిఫారసు చేస్తారు. ఇంజనీరింగ్ కళాశాలలోని టీచర్లకు జేఎన్‌టీయూ సిఫారసు చేస్తుంది.ఈ నెల 6న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. 2021లో జరిగిన ఎన్నికలలో సుమారు 17 వేల మంది ఓటర్లు ఉన్నారు.గత నెల 24న ప్రకటించిన ముసాయిదా జాబితాలో కొత్తగా 13,677 మందికి ఓటు లభించింది. అంటే మొత్తంగా 30 వేల మంది ఓటర్లు ఉండే అవకాశం ఉంది.

అభ్యర్థులు వీరే..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు అంటే తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి, ఏలూరు,అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ జిల్లాల పరిధిలోని రంపచోడవరం, చింతూరు (ఎటపాక) డివిజన్ల పరిధిలోని టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఇప్పటి వరకూ పీడీఎఫ్ ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థిగా పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మం డలం నారినమెరక పంచాయతీలోని గమళ్లపేటకు చెందిన బొర్రా గోపిమూర్తి పేరు ఖరారైంది. ఎస్‌టీయూ నుంచి లంకలపల్లి శ్రీనివాసరావు పేరు మొదట్లో వినిపించింది.కానీ ప్రస్తుతం మౌనంగా ఉండడం గమనార్హం. గత ఎన్నికల్లో ఎస్‌టీయూ తరఫున పోటీచేసి ఓటమిపాలైన గంధం నారాయణరావు కూడా పోటీకి వస్తారనే ప్రచారం ఉంది. ప్రస్తుతానికి ప్రచారంలో పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ముందున్నారు.



మాటల్లేవ్.. చేతలే!

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా..

- పిఠాపురం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- మోడల్ నియోజకవర్గంగా చేస్తా
- సమస్యలు నా దృష్టికి తీసుకురండి
- గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్
- పిఠాపురంలో సుడిగాలి పర్యటన

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'అన్నిరంగాల్లో పిఠాపురాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నాం. ఇందులో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మాటలు కాదు.. చేతల్లో చేసి చూపిస్తున్నా.. ఎన్నికల ముందు మీకు ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలను మిగిలిన నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు చూసి ఆదర్శంగా తీసుకునేలా అభివృద్ధి చేస్తా..' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ప్రకటించారు.





ఇంత దారుణమా..

గ్రామీణ నీటిపారుదల శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం తన పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తుండగా ఒక కుళాయి నుంచి నీరు మెల్లగా రావడం చూసి నిర్ఘాంత పోయారు.. కాసేపు దీర్ఘంగా చూస్తుండిపోయారిలా..!

మధ్యాహ్నం వచ్చారు.. సాయంత్రం వెళ్లారు!

పిఠాపురం శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తొలిసారి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనల్లో పాల్గొన్నారు. మండల కేంద్రాలైన గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లిల్లో సుడిగాలి పర్యటన జరిపారు. దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వివిధ వర్గాల ప్రజల నుంచి విన తులు స్వీకరించారు. వారి సమస్యలపై స్పందించారు. పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మిగిలిన వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మధ్యాహ్నం 12.36 గంటలకు చేరుకున్నారు. అక్కడ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని పిఠాపురం టీటీడీ కల్యాణమండంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు.అక్కడి నుంచి కొత్తపల్లి చేరుకుని పీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని చేబ్రోలు నివాసానికి చేరుకున్నారు. కారు నుంచే వినతిపత్రాలు స్వీకరించి సాయంత్రం 5.18 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లారు.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో కార్తీకస్నానాలు

చేర నీ పాద దీపం..

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి తీరం కార్తీక శోభతో ప్రజ్వరిల్లింది. కార్తీక మాసం తొలి సోమవారం రాజమహేంద్రవరంలో గోదావరి రేవులన్నీ భక్తుల తో కిటకిటలాడాయి. వేకువ జామున మహిళలు పెద్ద ఎత్తున కోటీలింగాల రేవు, చింతాలమ్మఘాట్, పద్మావతి ఘాట్, పుష్కరాలరేవు, టీటీడీ ఘాట్, మార్కండేయ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో పుణ్యస్నానాలు చేశారు. రేవుల్లో మెట్లపై ముగ్గుపెట్టి తమలపాకు లో పసుపు గణపతిని ఏర్పాటు చేసి పూజించారు. అనంతరం దీపారాధన చేసారు. కొబ్బరికాయ కొట్టి పూజాప్రక్రియ పూర్తి చేసి అనంతరం పురోహితులకు దీపదానాలు, శాలిగ్రామదానాలు సమర్పించారు. కార్తీక దీపాలను నదిలో విడిచిపెట్టారు. అనంతరం కోటిలింగాల క్షేత్రంలో ఉమాకోటిలింగేశ్వర స్వామి అమ్మవార్లను, పుష్కరాల రేవులో స్వామివారిని, టీటీడీ ఘాట్ వద్ద మార్కండేశ్వరస్వామిని దర్శించుకుని మహాశివునికి ప్రత్యేక అర్చనలు అభిషేకాలు చేశారు. దీంతో ఆయా ప్రాంతాలు భక్తులు కిటకిటలాడాయి.





గౌతమి ఘాట్ వద్ద మహాకాళేశ్వరుడు..పుష్కరఘాట్‌లో దీపం వదులుతున్న మహిళ..కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో కార్తీకస్నానాలు



కొవ్వూరులో గోదావరి మహానీరాజనానికి హాజరైన భక్తజనం..చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి తదితర నాయకులు(ఇన్‌సెట్‌లో) మహా నీరాజనం

కొవ్వూరులో భక్తజన హారతి

గోదావరి మాతకు టీటీడీ మహానీరాజనం

కొవ్వూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో భక్తితో దీప ప్రజ్వలన చేయడం వల్ల పరమాత్మ మనలో అజ్ఞానాన్ని తొలగించి వెలుగులు నింపుతాడని తితిదే దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. టీటీడీ ధర్మప్రచారంలో భాగంగా కార్తీకమాసం తొలి సోమవారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహా మంగళహారతిని అందజేశారు. ముందుగా టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు విశిష్టపూజలు చేశారు. గోదారమ్మకు వాయినం అందజేశారు. గోదావరి మాతకు ప్రతినిత్యం నీరాజనం అందజేయాలన్నారు. శివ, కేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో అరుణోదయానికి ముందు, సూర్యాస్తమయం తరువాత నదీ తీరంలో దీపాలు వెలిగించడం వలన అజ్ఞానం తొలగి జ్ఞానం పెంపొందుతుందన్నారు. దీపాలు వెలిగించే సమయంలో తూర్పు, ఉత్తర ముఖంగా పెట్టి వెలిగించాలన్నారు. నదీ స్నానం చేసిన, దర్శించినా, స్పర్శించినా, సేవించినా పుణ్యఫలం చేకూరుతుందన్నారు. కార్తీకమాసం మొదటి సోమవారం గోదావరి పుట్టుకకు కారణమైన పుణ్యక్షేత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదారమ్మకు మహా నీరాజనం అందజేయడం పుణ్యఫలం అన్నారు. అనంతరం ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో గోదారమ్మకు వివిధరకాల హారతులు అందజేశారు. తితిదే ఆధ్వర్యంలో మహా నీరాజనం జరగడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో గోష్పాదక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలివచ్చి మహాక్రతువును తిలకించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,టీటీడీ ట్రస్టుబోర్డు సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు,సుబ్బరాయచౌదరి,ఛైర్మన్ బావన రత్నకుమారి, మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు నీరాజనం తిలకించారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- మంత్రి దుర్గేష్
- కాపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని, ప్రతి గింజ ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కాపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టారని కొన్న ధాన్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో చాలా మంది రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. ఆ ప్రభుత్వంలో ఇవ్వని సొమ్మును తమ ప్రభుత్వం రైతులకు చెల్లించిదన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి రెండు రోజుల్లో రైతులకు సొమ్ము చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో అతికాల శ్రీను, పిప్పర రవి, నందిన శ్రీనివాస చక్రవర్తి, తహశీల్దార్ అచ్యుతకుమారి, ఏడీఏ చంద్రశేఖర్, ఏవో మేరీ కిరణ్ పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

మండలంలోని నల్లాకుల వారి పాలెం సర్పంచ్ నల్లాకుల వెంకటేశ్వరరావు (కోట శ్రీను) తల్లి సుబ్బాయమ్మ ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబ సభ్యులను మంత్రి దుర్గేష్ పరామర్శించారు. అలాగే అజ్జరం టీడీపీ అధ్యక్షుడు పోతాబత్తుల శ్రీను భార్య కనకదుర్గ మృతి చెందగా కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోపాలపురం జడ్పీ హైస్కూల్ 1972 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

గోపాలపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్ 1972 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 52 ఏళ్ల తర్వాత ఒకే వేదిక మీద సందడి చేశారు. గోపాలపురంలో సోమవారం వారంతా ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఒకరికొకరు హత్తుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయుడు రాయల అప్పారావు కుమారుడు ఇదే పాఠశాలలో చదివారు. పాఠశాలను సందర్శించిన సందర్భంగా పూర్వ విద్యార్థులు అతన్ని సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు మానుకొండ విద్యాసాగర్, చిన్నబ్బాయి, సతీష్, కే.సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

- కాపురానికి రావడం లేదని భర్త అఘాయిత్యం
- ఓ వ్యక్తి సమయస్ఫూర్తితో తప్పిన ప్రాణాపాయం
- అనంతపల్లిలో వివాహితకు తీవ్ర గాయాలు





దాడిలో గాయపడిన గీత, భర్త శ్రీరాములు

నల్లజర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదనే కోపంతో భర్త ఆమెపై హత్యాయత్నానికి పాల్పడాడు. స్థానిక వ్యక్తి సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఆమెకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు వివరాల ప్రకారం.. అనంతపల్లి ఎన్టీఆర్ కాలనీకి చెందిన మజ్జి నాగేశ్వరరావు కుమార్తె గీత (34)కు ఏడేళ్ల క్రితం రాయలసీమ ప్రాంతానికి చెందిన కురిమట్ల రవితో వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు పుట్టాక వారిద్దరు కలహాలతో చట్టబద్ధంగా విడిపోయారు. అనంతరం ఆమె తండ్రి వద్దే ఉంటు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెలుపల డాక్యుమెంట్ రైటర్ వద్ద సహాయకురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో కాకినాడ జిల్లా పెదపూడి గ్రామానికి చెందిన దేగల శ్రీరాములుతో ఏడాదిన్నర సహజీవనం చేసి గుడిలో పెళ్లి చేసుకుంది. శ్రీరాములు చెడు అలవాట్లకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా జులాయిలా తిరుగుతున్నాడు. అతని పోషణ కూడా ఆమె చూస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల భర్తను ఇంటి నుంచి గెంటేసింది. సోమవారం ఉదయం ఆమె ఇంటికి రాములు వచ్చి కాపురానికి రమ్మంటు పట్టుబట్టగా పెద్దలను తీసుకుని వచ్చి తమ కుమార్తెకు హామీ ఇస్తే తప్ప పంపనని గీత తండ్రి నాగేశ్వరరావు చెప్పాడు. అలాగే సాయంత్రం వస్తానని వెళ్లిన శ్రీరాములు యూనియన్ బ్యాంకులో చలనాలు కట్టి తిరిగి వస్తున్న గీతపై కత్తితో దాడి చేసి వీపుపై తీవ్రంగా గాయపరిచాడు. పంచాయతీ ఆఫీసులో పని చేస్తున్న మన్నేలి పవన్‌కుమార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కత్తితో దాడి చేస్తున్న శ్రీరాములును ఇటుకతో దూరం నుంచి తలపై కొట్టాడు. దీంతో రెండో వేటు వేయడానికి సిద్ధపడుతున్న అతడు దిమ్మతిరిగి పడిపోయాడు. వెంటనే లేచి కత్తిని అక్కడే వదిలి బైక్‌పై పరారయ్యాడు. పవన్ లేకపోతే గీత ప్రాణాలతో మిగిలేది కాదు. గాయపడిన గీతను 108 వాహనంలో రాజమహేంద్రవరం తరలించారు. నల్లజర్ల ఎస్ఐ సోమరాజు, దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రురాలి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.



సమావేశంలో పాల్గొన్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించాలి

కొవ్వూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ సమస్యలు పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు రొంగల హరీష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్, ప్లంబింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌లు, ప్లంబర్‌లు అందరూ సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జె.సూరిబాబు, వి.గణేష్, ఎస్.వెంకన్న, సీహెచ్ శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి కలశపూజ మహోత్సవం



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న మాలధారులు

నిడదవోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని శేషగిరి హాస్పిటల్స్ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం కార్తీక సోమవారం సందర్భంగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి, ఆటో కన్సల్టెన్సీ యజమాని పాటే అయ్యప్ప ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి కలశపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. అర్చకులు బాదంపూడి రామకృష్ణ, గాయత్రి శర్మల పర్యవేక్షణలో గురుస్వామి గంధం అంజిబాబు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ఘనంగా పూజలు నిర్వహించారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి

దేవరపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం యర్నగూడెం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందాడు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నాయగూడెం గ్రామానికి చెందిన కడిమి అంజిబాబు(36) దేవరపల్లిలో కొంతకాలంగా నివాసం ఉంటూ అనంతపల్లిలోని ఇటుకల బట్టీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం మోటార్‌సైకిల్‌పై పనిలోకి వెళ్లి తిరిగొస్తుండగా యర్నగూడెం-కృష్ణంపాలెం మధ్యన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు తండ్రి వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అంజిబాబుకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సికా జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు

రాజానగరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా కాపు అసోసియేషన్(సికా) జిల్లా అధ్యక్షుడిగా సంగీత రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సికా ప్రధాన కార్యదర్శి, ఏపీ అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సాధించడం, రాష్ట్ర, దేశాభివృద్ధికి, రాజ్యాంగ రక్షణకు, కృషి చేయాలని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- చాగల్లులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- పలువురి నుంచి వినతుల స్వీకరణ



చాగల్లులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జనసేన నాయకుడు ఉప్పులూరి చిరంజీవి మాట్లాడుతూ మార్కొండపాడులోని రైతుభరోసా క్రేంద్రం నిర్మాణం అసంపూర్ణంగా ఉందని, బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లించేశారని, మండలంలో సచివాలయ భవనాల నిర్మాణంలోను చాలా అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ జరిపించాలని కోరారు. కలవలపల్లికి చెందిన ముళ్లపూడి అప్పారావు మాట్లాడుతూ చిక్కాల గ్రామంలో కొండ చిలువలు, రక్త పొడలు తిరుగుతున్నాయని వాటిని పట్టుకుని అడవిలో విడిచిపెట్టేలా అటవీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఒక కాంట్రాక్టరు వినతిపత్రం అందజేశారు. నిడదవోలు, పంగిడి రోడ్డు మరమ్మతులు చేయాలని పలువురు కోరారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ రోడ్ల మరమ్మతుల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని పనులు కూడా ప్రారంభించినట్టు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కరుటూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో ఎంపీడీవోకి వినతిపత్రం అందిస్తున్న ఉపాధి కూలీలు

డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్..

కొవ్వూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 3 సీనియర్ సిటిజన్ కేసులు వచ్చినట్టు కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి

నల్లజర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పనులు లేక కుటుంబ పోషణ భారంగా ఉందని అచ్చన్నపాలెం ఉపాధి కూలీలు సోమవారం ఎంపీడీవో సింహాద్రిరావుకు వినతిపత్రం అందించారు. గ్రామ సభలో చర్చించుకున్న పనులకు వైసీపీ సర్పంచ్ జాలపర్తి సౌజన్య తీర్మానం ఇవ్వకపోవడం వల్ల పనులు ఉండడంలేదన్నారు. సర్పంచ్‌తో మాట్లాడి పంచాయతీ తీర్మాణాలు ఇస్తే తమకు పనులు ఉంటాయని వారానికి రూ.1200 నుంచి 1800 సంపాదన ఉంటుందన్నారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కొవ్వూరు-విజయవాడ
ఆర్టీసీ కొత్త సర్వీస్

కొవ్వూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసి డిపో నుంచి అన్ని ప్రాంతాలకు బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు-విజయవాడ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ కొత్తగా సర్వీసును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం మీదుగా హైదరాబాద్, జంగారెడ్డిగూడెం, ప్రసుత్తం విజయవాడ సర్వీసులను ప్రారంభించామన్నారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్ళే అన్ని ఎక్స్‌ప్రెస్‌లు కొవ్వూరు టౌన్‌లోకి వచ్చి వెళ్లాలని జిల్లా రివ్యూ సమావేశంలో కోరినట్టు చెప్పారు. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలను నిషేధించిన నేపథ్యంలో బస్సులన్నీ గామన్ వంతెన మీదుగా టౌన్‌లోకి రాకుండా వెళ్లిపోతున్నాయని, అందువల్ల కొవ్వూరు నుంచి విజయవాడకు ఉదయం 6-30, మధ్యాహ్నం 1-30 గంటలకు నడిచే విధంగా కొత్త సర్వీసును ప్రారంభించామన్నారు. డిపో మూసివేసి మరలా ప్రారంభించిన సమయంలో కొత్త బస్సులను ఇవ్వకుండా పాడైపోయిన బస్సులను కొవ్వూరుకు కేటాయించారని సంబంధిత శాఖా మంత్రి, రీజనల్ మేనేజర్‌లకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత కంటమణి రామకృష్ణారావు, డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్, ఆర్టీసీ అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మేన్ ఆర్.సునయన, ఎస్‌టీఐ కుమారి, ఎల్‌డీ మౌలాలి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- గోపాలపురం, యర్నగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పెట్రోల్ బంక్ ప్రారంభం



గోపాలపురంలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం/దేవరపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): దేశానికి పట్టెడు అన్నం పెట్టే రైతుకు అండగా నిలిచి వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురంలో సొసైటీ కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, దేవరపల్లి మండలం యర్నగూడెంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతును నిర్లక్ష్యం చేసిందని, ధరల స్థిరీకరణ పేరుతో ప్రజాధనాన్ని జగన్ పక్కదారి పట్టించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే తుఫాన్ల కారణంగా పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారాన్ని అందించిందని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ధాన్యానికి మద్దతు ధర ప్రకటించిందని పేర్కొన్నారు. సాధారణ రకం (75 కిలోలు) రూ.1725, గ్రేడ్-1 రకం రూ.1745కి కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఏ రైస్‌మిల్లుకైనా అమ్ముకోవచ్చని, 48గంటల్లో సొమ్ములు చెల్లించనున్నట్టు చెప్పారు. అనంతరం వాదాల కుంట, సద్దొండ, చెరుకుమిల్లి, జగన్నాథపురం గ్రా మాల్లో సుమారు రూ.4 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. గోపాలపురంలోని అనంతేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనం తరం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదును పరిశీలించారు. ప్రక్రియ వేగవంతం చేయాలని తహశీల్దార్ విద్యాపతిని ఆదేశించారు. కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, టీ డీపీ దేవరపల్లి అధ్యక్షుడు అంగ్రూ అనీల్, పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన విజయభాస్కర్, కొవ్వూ రు డివిజన్ కోపరేటివ్ అధికారి వి.కృష్ణకాంత్, సర్పంచ్ బొంతా భరత్‌బాబు, కాట్నం గణేష్, గోపాలపురం సొసైటీ సీఈవో ముదుమూరి శ్రీనివాస్, కొర్లపాటి రాము, వడ్లమూడి రమేష్‌బాబు, జ్యేష్ట శ్రీధర్, కూనపం ప్రసాద్‌బాబు, సత్యనారాయణ, వేముల నాగరాజు, ఏవో పి.రాజారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయిద్దాం

నల్లజర్ల, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించుకునే విధంగా ప్రతి నాయకుడు కృషి చేయ్యాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుఅన్నారు. సోమవారం దూబచర్ల కల్యాణ మండపంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధి, పార్టీ సభ్యత్వ నమోదు, గ్రామ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కార్యకర్తలు, నాయకులతో చర్చించారు. సమావేశంలో మీరా, ఈడే శ్రీను, కూచిపూడి ఉదయభాస్కరావు, రావూరి వెంకట రమణ, ఏలేటి సత్యనారాయణ, అనంతలక్ష్మి, సర్పంచ్ బాలయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జేఏసీ
జిల్లా చైర్మన్‌గా రమణ

కొవ్వూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జిల్లా చైర్మన్‌గా కొడమంచిలి రమణ నియమితులయ్యారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ డాక్టర్ మామిడి సుదర్శన్ నియామకపత్రాన్ని సోమవారం అందించారు. దీనిపై రమణ మాట్లాడుతూ జిల్లా, అసెంబ్లీ, పట్టణ, మండలాల వారీగా కమిటీల నియామకం చేపడతామన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

చాగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేషన్, డిప్లమో చేసిన వారంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. నమోదుకు రెండు రోజులే నమోదు గడువు ఉందని అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకొనేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నల్లజర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో రేషన్ బియ్యం పట్టుకున్నట్టు ఏయస్‌వో నాగాంజనేయులు తెలిపారు. సోమవారం నల్లజర్లలో తనిఖీలు చేయగా ఒక షెడ్డులో లంకా వెంకటకృష్ణకు చెందిన 2850 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. అతఛిటపై కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట డీటీ సత్యనారాయణ ఉన్నారు.





కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు. పక్క చిత్రంలో గోష్పాద క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు



గోష్పాదక్షేత్రం స్నానఘట్టంలో కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకం చేస్తున్న మహిళలు



నిడదవోలులో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో గోలింగేశ్వరస్వామి

శివాయ..రుద్రాయ..నీలకంఠాయ నమః

• భక్తులతో కిటకిటలాడిన గోష్పాదక్షేత్రం • ప్రత్యేక పూజలు, అభిషేకాలు • దీపదానం చేసిన దంపతులు

కొవ్వూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా గోదావరితీరంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే పట్టణ, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి చేరుకున్నారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. ప్రధాన స్నానఘట్టాల్లో నున్న శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటిడొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు చేశారు. పండితులకు సాలగ్రామ, దీపదానాలు ఇచ్చారు. క్షేత్రంలోని ఆలయాలతో పాటు, కొవ్వూరు పట్టణ, మండల గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్రంలో అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు చేశారు. మున్సిపల్ కమీషనర్ టి.నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు.

నిడదవోలు: పట్టణంలోని గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం మొదటి కార్తీక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. సోమేశ్వరస్వామికి, గోలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, దీపార్చన చేశారు. భక్తులు శివాలయాల్లోని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నిత్యావసరాల ధరలు అదుపుచేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుల రక్తాన్ని పీల్చుతున్నాయని, మార్కెట్‌లో ధరలు పెరగకుండా ప్రభుత్వం అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన మహిళా సమాఖ్య నగర, జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిత్యావసరాలు, కూరగాయల ధరలను నియంత్రించేలా ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్నారు. మంచి ప్రభుత్వం అంటే ధరలు తగ్గించే విధంగాచర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ హింస ప్రతి ఏటా పెరిగిపోవడానికి మద్యమే కారణమని, మద్యం నియంత్రణ చేసి మహిళల గౌరవాన్ని కాపాడి ధర్మాన్ని రక్షించాలని కోరుతున్నామని అన్నారు.

పులగుర్తలో ఆర్టీసీ బస్సు బోల్తా

- ముగ్గురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- చెట్టు అడ్డు ఉండడంతో తప్పిన భారీ ప్రమాదం



పులగుర్త వద్ద బోల్తా పడ్డ ఆర్టీసీ బస్సు

అనపర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు బోల్తా పడి ముగ్గురు తీవ్రగాయాలపాలయ్యారు. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో రావులపాలెం బయలుదేరింది. అనపర్తి మండలం పులగుర్త వచ్చే సరికి అదుపుతప్పి రామచంద్రపురం- మండపేట కెనాల్ వైపు బోల్తా పడింది.ప్రయాణికులు భయాందోళనకు గురై ఆర్తనాదాలు చేశారు.రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఉండ డంతో బస్సు కాలువలోకి వెళ్లలేదు.దీంతో భారీ ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో బస్సు లో డ్రైవర్, కండక్టర్ సహా 26మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు స్పందించి 108కి సమాచారం అందించి ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. వీరిలో రాయవరం గ్రామానికి చెందిన బొడ్డు సూర్యకళ, తూరంగికి చెందిన కొప్పిశెట్టి ఆంజనేయరాజు,కె.మల్లవరం గ్రామానికి చెందిన నూకల వీరభద్రరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.సూర్యకళ తలకు బలమైన గాయం కావడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు.బస్సు స్టీరింగ్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని డ్రైవర్ పేర్కొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: అమరన్
వై.స్క్రీన్2	: లక్కీ భాస్కర్
దేవిశ్రీ(గాయత్రి	: క
అనన్య	: భఘీర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: లక్కీ భాస్కర్
రాధాకృష్ణ	: వెనం
శ్రీగణపతి	: అమరన్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర